

• కృష్ణ కృష్ణ.. రామరామ

విజయవాడ నుంచి ఏలూరు వరకు సాగే కృష్ణ కాల్వ నిర్వహణ సైతం జగన్ ప్రభుత్వం ఏనాడో గాలి కొది లేసింది. వేలాది ఎకరాలకు సాగునీరు, ఏలూరులో లక్ష కుటుంబాలకు తాగునీరు అందించే ప్రధాన జల వనరు అయిన కృష్ణ కాల్వకు జగన్ ప్రభుత్వంలో అతీగతీలేని దుర్గతి పట్టింది. కాల్వ గట్టు ఆసాంతం పిచ్చిమొక్కలు, పెద్దపెద్ద వృక్షాలతో నిండి చిక్కిశల్యమైనా ఏనాడూ కాల్వను పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎనిమిదేళ్ల క్రితం కలపర్రు గోగులమ్మ గుడి వద్ద కృష్ణకాల్వకు గండి పడి వందలాది ఎకరాలు నీట మునిగి పంట నష్టం జరిగింది. కాని ఈసారి భారీ వర్షాల కారణంగా కృష్ణ కాల్వకు గండి రివర్స్‌లో పడింది. బొమ్ములూరు నుంచి రామిలేరు ఉప్పొంగి పొలాలను ముంచెత్తడంతో ఆ నీటి ఒత్తిడికి అప్పటికే బలహీనంగా ఉన్న కృష్ణ కాల్వకు పునుకొల్లు వద్ద రెండు చోట్ల గండిపడింది. గట్ల నిర్వహణను గాలికొదిలేయడం వల్లే పొలాల్లోని నీరు గండిపడి కాల్వలోకి చేరింది. దీంతో కృష్ణ కాల్వ ఉప్పొంగుతూ ప్రవ హిస్తోంది. పొలాల నుంచి వచ్చే వరద నీటితో ఒత్తిడికి గురై కాల్వ గట్టుకే గండి పడడం విచిత్ర పరిణామం.

నిర్లక్ష్య ఖడ్గం!



జల వనరులను పట్టించుకోని జగన్ సర్కార్

- కనీస నిర్వహణ ఏనాడో గాలికొదిలేశారు
- ఇరిగేషన్ అధికారులవీ పక్కచూపులే
- ఫలితంగానే భారీ గండ్లు
- క్షోభ మిగిల్చిన పెద్ద చెరువు, పెదవాగు ప్రాజెక్టు, కృష్ణ కాల్వ గండ్లు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

గడిచిన ఐదేళ్లలో నీటి వనరుల నిర్వహణే లేదు. వాటి గురించి పట్టించు కున్న మంత్రులు, ఎమ్మెల్యేలు అంతకంటే లేరు. వీటి నిర్వహణ బాధ్యతలు మోసిన నీటి సంఘాలను అధికారంలోకి వచ్చీరాకముందే వైసీపీ సర్కార్ నేలమట్టం చేసింది. ఏటా నీటి వనరుల నిర్వహణకు బడ్జెట్‌లోను పైసా విదల్చలేదు. బాధ్యత వహించాల్సిన అధికార యంత్రాంగం వెర్రి చూపులు చూస్తూ గడిపింది. ప్రశ్నించే నాథుడు లేక కాల్వ గట్లు, చెరువుగట్లు అధ్వానంగా మారాయి. తాజాగా భారీ వర్షాలు వచ్చినప్పుడు వాగులు, వరదలు పొంగినప్పుడు ఊహించని నష్టమే జరిగింది. దీనికంతటికి గడిచిన ప్రభుత్వ నిర్లక్ష్యం ఒక ఎత్తయితే చూసీచూడనట్టు వదిలేసిన అప్పటి ప్రజాప్రతినిధులు, ఎలాగూ పట్టించుకోవడంలేదు కదా అని పక్క చూపులు చూసిన ఇరిగేషన్ అధికారులు తాజా దారుణాలకు బాధ్యత వహించాల్సిందే.

అంతులేని.. నిర్లక్ష్యం

ఏటా వేసవిలోనే సాగునీటి వనరులు రక్షణకు వీలుగా ఇంతకుముందు తెలుగుదేశం ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో ముందుకు సాగేది. తగినంత నిధులు కేటాయించేది. ఎక్కడికక్కడ నీటి సంఘాలే రంగంలోకి దిగి రైతులతో కూడ బలుక్కుని చిన్నాచితక పనులను స్వచ్ఛందంగా చేసేవారు. రైతుల నుంచి వచ్చే విజ్ఞప్తులకు తక్షణ పరిష్కారంగా స్పందించేవారు. గడిచిన ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వానికి ఇవేవీ పట్టలేదు. కాల్వల ఆధునికీకరణ, చెరువుల నిర్వ హణ పక్కనపెట్టేసింది. జల వనరులన్నింటినీ జగన్ నిర్లక్ష్యమే ఐదేళ్లు వెంటా డింది. ఆ ఫలితం ఇప్పుడు కాల్వలు, చెరువులకు గండి పడి జనం నష్టాల్లో కూరుకుపోయేటంతగా చేసింది. ఐదేళ్ల నష్టాలు, ప్రజల కష్టాలకు తాజాగా పడిన గండ్లు ప్రజలకు మరింతగా పుండు మీద కారం అయ్యాయి. ఇలా ఒక్కొక్కటిగా చెప్పుకుంటూ పోతే ప్రభుత్వాల నిర్లక్ష్యాలు ఒక ఎత్తయితే, ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, అధికారుల బాధ్యతా రాహిత్యం వలన అంతిమంగా ప్రజలే నష్టపోవాల్సి వస్తోంది.

• కోట్లు పోయే.. పంట పోయే

వేలేరుపాడు మండలంలో ఉన్న పెదవాగు ప్రాజెక్టు గడిచిన ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం. ఈ ప్రాజెక్టు ద్వారానే ఏపీలో 18 వేల ఎకరాలుకు సాగునీరు అందుతుంది. అదే తెలంగాణ పరిధిలో మరో రెండు వేల ఎకరాలకు చేలకు నీరు అందుతుంది. అలాంటి మైనర్ ప్రాజెక్టును కాపాడుకోవాల్సింది పోయి ఆఖరుకు గోదావరి బోర్డు సైతం ప్రాజెక్టు సంరక్షణ, మరమ్మతులకు వంద కోట్లకుపైగా నిధులను కేటాయించాలని సూచించినా గడిచిన ఐదేళ్లల్లో జగన్ ప్రభుత్వం వీసమెత్తు కదలలేదు. అంతకంటే మించి ఈ ప్రాజెక్టు నిర్వహణ అంతా తెలంగాణదే అన్నట్టుగా పక్క చూపులు చూస్తూ వచ్చింది. గోదావరి అథారిటీ కోరినా, ఆదేశించినా బేఖాతర్ చేశారు. గడిచిన జూలై మాసంలో పెదవాగుకు వరద పోటెత్తడంతో ప్రాజెక్టు అప్రోచ్ కొట్టుకు పోయింది. రైతులను నివ్వెరపోయేలా చేసింది. ఒకవేళ అప్పటి జగన్ ప్రభుత్వం నిధులు కేటాయించి ఉంటే ఈ ప్రాజెక్టుకు ఇలాంటి పరిస్థితి వచ్చేదేకాదు. ఇంకో వైపు ప్రాజెక్టు అప్రోచ్ కొట్టుకుపోయింది కాబట్టి తాత్కాలిక మరమ్మతుల నిమిత్తం తెలంగాణ ప్రభుత్వమే ముందుకు వచ్చి మూడున్నర కోట్లు కేటాయించింది. ఈ నిధులతో ప్రాజెక్టు వద్ద రింగ్‌బండ్ నిర్మించారు. తాజాగా కురిసిన వర్షాలకు మరోమారు వరద చొచ్చుకురావడంతో రింగ్ బండ్ కాస్తా కొట్టుకుపోయింది. కోట్లాది రూపాయలు వృథా అయ్యాయి. అంతకంటే మించి ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతుల ఆశలు ఆవిరయ్యాయి.



• 56 ఏళ్ల క్రితం గండి.. మళ్లీ అదే చోట

వందలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న నూజివీడు పెద్ద చెరువు రక్షణకు గడిచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ఏనాడూ అధికారులను అక్కడికి పంపలేదు. ఎప్పుడో సాంకేతికత అందుబాటులోకి రానప్పుడు అధికారుల సంఖ్య ఇప్పుడున్న ట్టుగా లేనప్పుడు అప్రమత్తత తెలియని పరిస్థితుల్లో 1968 లో పెద్ద చెరువుకు గండి పడింది. సరిగ్గా 56 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు తాజాగా అదే చోట గండిపడింది. అతి పెద్ద విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు గట్టు పరిరక్షణకు ఏనాడూ అప్పటి జగన్ ప్రభుత్వంలో అధికారులుగాని, ఎన్నికైన ఎమ్మె ల్యేలు, మంత్రులు పట్టించుకోనేలేదు. గట్టు దెబ్బతింటుందని, బలహీన పడుతుందని స్థానికులు పదేపదే సంబంధీకు లకు తెలియచేసే ప్రయత్నం చేసినా పెడ చెవిన పెట్టారు. ఏదొక నాడు గండి ఖాయమని స్థానికులు ఊహించినట్టుగానే అదే జరిగింది. ఫలితం నూజివీడు పట్టణంలో పెను విపత్తు. పెద్ద సంఖ్యలో ఇళ్ళు దెబ్బతిన్నాయి. రామిలేరు పొంగి మరిం తగా పంట చేలు దెబ్బతిన్నాయి. వందలాది ఇళ్లు జల దిగ్బం ధనానికి గురయ్యాయి. ఏటా చెరువు గట్టు నిర్వహణ, భద్ర త, ఇతరత్రాపై అధికారులు అంచనా వేసి ఉంటే ఇలాంటి పరిస్థితి దాపురించి ఉండేదేకాదు. రైతులు, స్థానికులు పడిన కష్టాలకు అటు ఇంజనీరింగ్ అధికారులు, ఇటు ఐదేళ్ళ పాటు అధికారం చెలాయించిన జగన్ ప్రభుత్వం బాధ్యత వహించాల్సిందే.

అదనపు బాధ్యతల నుంచి మమ్మల్ని తప్పించండి

- ఆర్జీయూకేటీ వీసీకి స్పష్టం చేసిన కాంట్రాక్ట్ ఎంప్లాయీస్

నూజివీడు, సెప్టెంబరు 2 : సమస్యాత్మక విభాగాల్లోనే అదనపు బాధ్యతల పేరుతో కాంట్రాక్ట్ ఎంప్లాయీస్‌ను నియమించడంపై కాంట్రాక్ట్ అధ్యాపక సిబ్బంది తమ నిరసనను ఆర్జీయూకేటీ వీసీ విజయ్‌కుమార్ ఎదుట సోమవారం తెలిపారు. రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్, రెగ్యులర్, కాంట్రాక్ట్ అధ్యాపక సిబ్బందితో విడివిడిగా సమావేశమయ్యారు. వీసీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి కాంట్రాక్ట్ సిబ్బందితో సమావేశమవ్వగా కాంట్రాక్ట్ అధ్యాపకులు తమను అదనపు బాధ్యతల నుంచి విముక్తి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మెస్ కమిటీ పేరుతో కాంట్రాక్ట్ అధ్యాపకులను యాజమాన్యం నియమించిందని, పేరుకే కమిటీ కాని తమకు అధికారాలు లేవని, కేవలం ఫిర్యాదులను, సిఫార్సులను పైఅధికారులకు తెలపడమే తప్ప తాము ఏం చేయలేమన్నారు. అయితే ఇటీవల మెస్‌లో చోటు చేసుకున్న పరిణామాలపై నూజివీడు ట్రిపుల్ ఐటీకి వచ్చిన అధికారులందరూ మెస్ కమిటీ ఎక్కడ? అంటూ ప్రశ్నిస్తూ తమనే టార్గెట్‌గా మాట్లాడారని వాపోయారు. తాము మెస్‌ల నిర్వహణలో లోపభూయిష్ట విధానాలపై పలుమార్లు ఏవో, రిజిస్ట్రార్, డైరెక్టర్లకు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు విఫలమవ్వగా, తాము మాత్రం లక్ష్యంగా మారామన్నారు. ఇప్పటివరకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో తమను సమస్యాత్మక విభాగాల్లోనే కమిటీ మెంబర్లుగా నియమిస్తున్నారని, రెగ్యులర్ ఉద్యోగులు ఉండగా, తమనే ఎందుకు బలిపశువులుగా మారుస్తున్నారని ప్రశ్నించారు. ఎగ్జామ్‌సెల్‌లో ఒక ఉద్యోగి పనితీరుపై తాము ఫిర్యాదులు చేస్తే ఇప్పటికి చర్యలు అధికారులు తీసుకోలేదన్నారు. ఒక్క రూపాయి లాభం లేని అదనపు బాధ్యతలు చేస్తున్న తమకు కనీసం గౌరవం దక్కని పరిస్థితుల్లో ఈ అదనపు బాధ్యతల నుంచి తమను తప్పించాలని వీసీకి తేల్చిచెప్పారు. మరోవైపు త్రిసభ్య కమిటీ సభ్యులు, ఉన్నత విద్యాశాఖ ఇన్‌చార్జ్ చైర్మన్ రామ్మోహన్ ట్రిపుల్ ఐటీలోని రెగ్యులర్ సిబ్బందితో సోమవారం సాయంత్రం సమావేశమయ్యారు. కమిటీ రిపోర్టుకు సంబంధించి విధివిధానాల అమల్లో ఇప్పటివరకు తీసు కున్న చర్యలు ఇకపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు సమాచారం.

ట్రిపుల్ ఐటీ ఫుడ్ కాంట్రాక్టర్లపై కేసు | -7లో

ఆయాలు, నైట్ వాచ్‌మెన్లకు గౌరవ వేతనాలు విడుదల

ఏలూరు సెప్టెంబరు 2 : ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు క్లీన్‌చేసే ఆయాలు, నైట్ వాచ్‌మెన్లకు గౌరవ వేతనాల చెల్లింపునకు బడ్జెట్ నిధులను విడుదల చేస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో ఆయాకు, నైట్ వాచ్ మెన్‌కు నెలకు రూ. 6వేలు వంతున చెల్లిస్తారు. ఏడాదిలో వేసవి సెలవుల నిమిత్తం పాఠశాలలు రెండునెలలు పనిచేయనందున ఏప్రిల్, మే నెలలకు సంబంధించి ఆయాలకు సగం వేతనాలు మాత్రమే చెల్లిస్తున్నారు. నైట్ వాచ్‌మెన్లకు మాత్రం 12 నెలల కాలానికి పూర్తి వేతనాలను చెల్లిస్తారు. ఆ ప్రకారం జిల్లాలో ఆయాలు 1,866 మంది, నైట్ వాచ్‌మెన్లు 202 మంది పనిచేస్తున్నారు. వీరందరికీ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి గౌరవ వేతనాల బకాయిలు చెల్లించాల్సి ఉంది. నిధులు జిల్లాకు అందిన 24 గంటల్లోగా ఆయాలు, నైట్ వాచ్‌మెన్ల బ్యాంకు ఖాతాలకు జమచేసేందుకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. కాగా టాయిలెట్ల క్లీనింగ్ మెటీరియల్ కొనుగోలుకు కూడా నిధులు విడుదల చేశారు. వీటిని ప్రభుత్వమే కొనుగోలు చేసి పాఠశాలలకు సరఫరా చేస్తుంది.

నేడు ఆ నాలుగు మండలాల్లో పాఠశాలలకు సెలవు

వర్షాలు, వరదల కారణంగా మంగళవారం జిల్లాలోని నూజివీడు, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. మిగతా మండలాల్లోని పాఠశాలలన్నీ యథాతథంగా పనిచేస్తాయని, ఎక్కడైనా పాఠశాల నిర్వహణకు ప్రతికూల పరిస్థితులుంటే స్థానికంగా ఆ స్కూలుకు మంగళవారం సెలవు ప్రకటించుకునేందుకు అనుమతిస్తున్నట్టు వివరించారు. కాగా మంగళవారం జరగాల్సిన ఎస్‌ఏ‌ఎంపీ-1 పరీక్షను వాయిదా వేస్తున్నామని, ఈ పరీక్షను తిరిగి ఎపుడు నిర్వహించేదీ మళ్ళీ తెలియజేస్తామన్నారు. వాస్తవానికి ఈ పరీక్షలను రాష్ట్రవ్యాప్తంగా ఒకే తేదీల్లో నిర్వహించేందుకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేయగా వర్షాల కారణంగా కొన్ని జిల్లాల్లో ఆయా పరీక్షలు వాయిదా పడగా, మరికొన్ని జిల్లాల్లో షెడ్యూలు ప్రకారమే జరిగాయి. దీంతో పరీక్షలు ముగిసినచోట ప్రశ్నపత్రాలు బయట కు రాగా, వర్షాల వల్ల వాయిదా వేసిన జిల్లాల్లో అవే ప్రశ్నపత్రాలతో నిర్వహించనుండడంతో ఈ పరీక్షలకు ఇక పారదర్శకత ఎక్కడుం టుందని ఉపాధ్యాయ వర్గాలే వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం.

వీడని భయం!


పెదపాడు మండలం కడిమికుంట వద్ద చెరువును తలపిస్తున్న పంటపొలాలు

- ఇంకా వరదలోనే పెదపాడు ముంపు గ్రామాలు
- సహాయక చర్యల్లో అధికారులు.. ప్రజాప్రతినిధులు
- ఉధృతంగా కొల్లేరు, ఉప్పుటేరు
- కోమటిలంకకు రాకపోకలు బంద్

పెదపాడు, సెప్టెంబరు 2 : జిల్లాలో పెదపాడు మండలంలోని ముంపు గ్రామాల్లో ఇంకనూ వరద ప్రభావం తగ్గలేదు. అప్పనవీడు, తాళ్లమూడి, గోగుంట ఖాజీగూడెం, రాళ్లపల్లివారి పాలెం తదితర గ్రామాల్లో వరద నీరు క్రమేపీ తగ్గుతూ వస్తోంది. వరద తగిన ప్రాంతాల్లో తమ అవాసాలను శుభ్రం చేసుకునే పనిలో తలమునకలయ్యారు. జాతీయ రహదారిపై వరద నీరు తగ్గుముఖం పట్టడంతో వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఖాజీగూడెం పునరావాస కేంద్రంలో బాధితులకు ఆహార పంపిణీని అక్కినేని వంశీకృష్ణ పర్యవేక్షిస్తూ చర్యలు చేపట్టారు. అప్పనవీడులో కూటమి నాయకుల ఆధ్వర్యంలో కూరగాయలు అందజేశారు. పైనుంచి వస్తున్న వరదనీరు తగ్గడంతో కృష్ణా కాల్వ ప్రవాహ వేగం మందగించింది. తోటగూడెం, సత్యవోలు వద్ద రామిలేరు, కొణికి వద్ద బుడమేర ఉధృతంగా ప్రవహిస్తూ వరదనీరు కొల్లేరులో చేరుతోంది. మండలంలో ముంపునకు గురైన పంట పొలాలను ఎమ్మెల్యే చింతమనేని పరిశీలించి ప్రభుత్వం ఆదుకుంటుందని, ఆధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు.

వాగు దాటాలంటే..

కృష్ణా జిల్లా కుదరవల్లి, పెదపాడు మండలం కొణికి గ్రామాల నుంచి పెదపాడు వైపు రావాలన్నా, ఇటు నుంచి అటు వైపు వెళ్లాలన్నా ఇదొక్కటే ప్రధాన రహదారి. వరద ప్రభావంతో పెదపాడు మండలం కొణికి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద వున్న కాజ్‌వేపై ఐదగుడుల మేర నీరు ప్రవహిస్తోంది. ఈ నీటిలో మోటారుసైకిళ్ల రాకపోకలు సాగిస్తే ఇంజన్‌లోకి నీరు వెళ్లి మొరాయిస్తున్నాయి. కొందరు స్థానికులు వాహనానికి రూ.50, రూ.100 తీసుకుని కర్రలు, తాళ్ల సాయంతో మోటారుసైకిల్‌ను ఎత్తి పట్టుకుని అటు, ఇటు దాటిస్తున్నారు.




వెంకటాపురంలో నీటమునిగి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని


సత్యవోలు వద్ద రామిలేరు ఉధృతి


సత్యవోలు సమీపంలో చెరువును తలపిస్తున్న పంటపొలాలు


ఏలూరు శనివారపుపేట కాజ్‌వేపై ప్రహహిస్తున్న తమ్మిలేరు


వరదనీటి మధ్యలో పెదపాడు మండలం తాళ్లమూడి వైఎస్ఆర్ కాలనీ

కొల్లేరు గ్రామాలకు వరద ముప్పు


అటపాక పక్షుల కేంద్రం వద్ద కొల్లేరులోకి చేరుతున్న వరద నీరు

భయపెడుతున్న కొల్లేరు


కైకలూరు/ మండవల్లి/కలిదిండి/ఏలూరు రూరల్/ చింతలపూడి : ఎగువన కురిసిన భారీ వర్షాలకు కొల్లేరు ప్రాంతానికి భారీగా వరద నీరు చేరడంతో ప్రమాదం పొంచి ఉంది. మండవల్లి మండలంలోని పెనుమాకలంక, పెద్దఎడ్లగాడి రహదారి ముంపు బారిన పడింది. విజయవాడ పరిసర ప్రాంతాల్లో ముంపు తీవ్రంగా ఉన్నందున ఆ నీరంతా మరో రెండు రోజుల్లో కొల్లేరు సరస్సులోనికి చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పెనుమాకలంక, ఇంగిలిపాకలంక, నందిగామలంక, శ్రీరామ్‌నగర్, మణుగులూరుకు వరద పొంచి ఉండడంతో కొల్లేరు గ్రామాల్లో ప్రజలు సైతం భయభ్రాంతులకు గురవుతున్నారు. పెద్ద, చిన్నఎడగాడి వద్ద గుర్రపుడెక్క, తూడు, కిక్కిస పెద్దఎత్తున మేట వేసుకుపోవడంతో నీటి ప్రవాహానికి అవరోధంగా మారింది. మరింత వరద నీరు చేరితే నీరు దిగువకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో పై గ్రామాలు ముంపు బారిన పడనున్నాయి. మండవల్లి మండలంలోని పెద్దఎడ్లగాడి, చిన్నఎడ్లగాడి వద్ద రహదారి అంచున నీరు తాకుతూ ప్రవహిస్తోంది. కైకలూరు మండలంలో పక్షుల కేంద్రం వద్ద పోల్‌రాజ్ డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తోంది. కోమటిలంక గ్రామ రహదారి కొట్టుకు పోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని కొల్లేరు గ్రామాలైన పెంచికలమర్రు, వడ్లకూటితిప్ప, పందిరిపల్లి గూడెం, కొల్లేటికోట, లక్ష్మీపురం, గోకర్ణపురం, శృంగవరప్పాడు, గుమ్మళ్లపాడు గ్రామాలకు ముంపు పొంచి ఉంది. భారీ వర్షాలకు ఎగువ నుండి కొల్లేరులోనికి కొద్దిమేరకు నీరు చేరడంతో అధికారులు కొల్లేరు లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. సోమవారం మండల ప్రత్యేక అధికారి జడ్పీ సీఈవో సుబ్బారావు కొల్లేరు గ్రామాలైన పెంచికలమర్రు, పందిరిపల్లిగూడెం గ్రామాల్లో పర్యటించారు. సర్కారు కాల్వ వద్ద వరదను పరిశీలించారు. పెంచికలమర్రులో జువ్వకనుమల డ్రెయిన్‌ను పరిశీలించారు. ఆయనతో పాటు తహసీల్దార్ ఉదయభాస్కర్, ఎండీవో ఉమామహేశ్వరరావు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఏలూరు రూరల్ మండలంలో తమ్మిలేరు మహోగ్రంగా కొల్లేరులోకి పరుగులు తీస్తోంది. కోమటిలంక రహదారిపై వరదనీరు పొంగుతుండడంతో ఆ ప్రాంతవాసులు పడవమీదే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. గతంలో గండిపడిన లింగారావుగూడెం వద్ద ప్రస్తుతం గండిపడకుండా అధికారులు చర్యలు చేపట్టారు. కొల్లేరులోని మందుకోడు, గుడివాకలంక ప్రజలు వరద భయంతో బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. కలిదిండి మండలంలో ఉప్పుటేరు నీటి మట్టం పెరుగుతోంది. భారీ వర్షాలు కురుస్తుండడంతో ఎగువన ఉన్న బుడమేరు, తమ్మిలేరులో నీరు కొల్లేరు ద్వారా ఉప్పుటేరులోకి వరద నీరు ప్రవహించడంతో ఉప్పుటేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. సున్నంపూడి, దుంపలకోడుదిబ్బ, కొండంగి, మట్టగుంట, పెదలంక గ్రామాల ప్రజలు వరద భయంతో ఉన్నారు. మండల ప్రత్యేకాధికారి భూషణరావు, రెవెన్యూ, డ్రెయినేజీ, ఇరిగేషన్, పంచాయతీ శాఖల అధికారులు ఉప్పుటేరు వెంబడి గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

తమ్మిలేరు రిజర్వాయర్‌కు వరద తగ్గుముఖం

చింతలపూడి సమీపంలోని నాగిరెడ్డిగూడెం వద్ద తమ్మిలేరు రిజర్వాయర్‌కు ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టింది. సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టు నీటిమట్టం 347.42 అడుగులు ఉంది. ఇన్‌ఫ్లో 4006 క్యూసెక్కులు వస్తోంది. దిగువకు 3839 క్యూసెక్కుల నీటిని మూడుగేట్లు ద్వారా విడుదల చేస్తున్నారు. సాయంత్రం ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్ ప్రాజెక్టు వద్దకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఇన్‌ఫ్లో తగ్గుతోందని, దిగువన ఏలూరుకు ముంపు ప్రమాదం లేదన్నారు. తహసీల్దార్ ప్రమదొర సిబ్బందితో సమీక్షించారు.

రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

ఏలూరు బైఫర్‌కేషన్ పాయింట్ ఎఫ్‌సీఐ గొడౌన్స్ వద్ద తమ్మిలేరు వరదకు సంబంధించి 2వ ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకుంటున్నట్టు ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ చిలకపాటి దేవప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు వద్ద తమ్మిలేరులో సుమారు 11 వేలు క్యూసెక్కుల నీరు వస్తుండగా 6వేల క్యూసెక్కుల నీరు తూర్పు తమ్మిలేరు ద్వారా, పశ్చిమ తమ్మిలేరు ద్వారా 5వేలు, కృష్ణా కెనాల్ నుంచి 500 క్యూసెక్కుల నీరు అనంగా కలిసి కొల్లేరులోకి వరదనీరు ప్రవహిస్తోందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


కోమటిలంక వద్ద వరద ఉధృతి

పంటలకు అపార నష్టం

ఏలూరు సిటీ : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయు 'గండం' ఏలూరు జిల్లాలో అపార నష్టాన్ని మిగిల్చింది. సార్వా ఆరంభంలోనే రైతులు నష్టాలను చవి చూడాల్సి వచ్చింది. కూరగాయలు, పండ్లతోటల పంటలు నాశనమయ్యాయి. పూలు మొక్కలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. అరటి తోటలు నేల రాలిపోయాయి. రహదారులు దెబ్బతిన్నాయి. జిల్లాలో 149.8 హెక్టార్లలో పండ్ల తోటలు దెబ్బతిని రూ. 4.44 కోట్లు నష్టం వాటిల్లినట్లు ఉద్యాన శాఖ ప్రాథమిక అంచనా వేసింది. జిల్లాలోని నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, కుక్కునూరు, చింతలపూడి మండలాల్లోని 228 రైతులు పండించిన ఉద్యాన పంటలు ఈ వర్షాలకు భారీగా దెబ్బతిన్నాయి. జిల్లాలో వరి పంటతో పాటు వివిధ పంటలు 4782.38 హెక్టార్లలో పూర్తిగా ముంపునకు గురయ్యాయి. వరి 3977.7 హెక్టార్లు మొక్కజొన్న 0.81, పత్తి 149, చెరకు 6.48, పెసలు 6.1, మినుము 634.6, వేరుశనగ 7.69 హెక్టార్ల లో ముంపునకు గురయ్యాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. దాదాపు ఈ పంటలు వేసిన 11,454 మంది రైతు లు ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చిందని చెబుతున్నారు. పంట నష్టాల నివేదికలను జిల్వా వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. రహదారులపై నుంచి వరద నీరు పారడం, ప్రవాహ ధాటికి రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులు కొట్టుకుపోవడంతో ఆర్అండ్‌బీ శాఖకు రూ.5 కోట్లు నష్టం వాటిల్లింది. మరోవైపు భారీ వర్షాల వల్ల విద్యుత్ శాఖకు కూడా నష్టం వాటిల్లింది. జిల్లాలో 11 కేవీ పోల్స్ నేలకొరిగి దెబ్బతిన్నాయని, ఒక డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిందని దీనివల్ల లక్షా 10 వేల రూపాయలు నష్టం వాటిల్లిందని విద్యుత్ శాఖ చెబుతోంది.

అప్రమత్తంగా ఉండండి..

కలెక్టర్ వెట్రిసెల్వి

జిల్లాలో తమ్మిలేరు, ఎర్రకాల్వ వరద ఉధృతితో పాటు గోదావరి వరదకు సంబంధించి మంగళవారం సాయంత్రానికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశాలున్నందున జిల్లా యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశిం చారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ప్రత్యేక అధికారులను నియమించా మన్నారు. మరో పక్క జిల్లాలో అధిక వర్షాల నేపథ్యంలో అన్ని మండలాల్లో ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో పని చేస్తున్నారన్నారు. ఎటువంటి విపత్కర పరిస్థితుల నైనా ఎదుర్కొనేం దుకు జిల్లా యంత్రాంగం సమాయత్తంగా ఉందన్నారు. అధిక వర్షాల వల్ల ముంపునకు గురైన కుటుంబాలకు కొన్ని నిత్యావసరాలు అందించేందుకు జేసీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

ఆపన్నహస్తం

» వరద బాధితుల కోసం ఆహార పొట్లాలు, పాలు, వాటర్ ప్యాకెట్లు
» పారిశుధ్య కార్మికులు, బోట్లు తరలింపు » ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి భారీగా సాయం

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఉభయ గోదావరి జిల్లాల యంత్రాంగం విజయవాడ వరద బాధితులకు సాయం అందించడానికి ముందుకొచ్చింది. ఆహార పదార్థాలతో పాటు బోట్లను పంపించారు. విద్యుత్ ఉపకరణాలను మరమ్మతులు చేయడానికి ఇక్కడ నుంచి రెస్క్యూ టీంలు, పారిశుధ్యం మెరుగుపరచడానికి పారిశుధ్య కార్మికులను తరలించారు.



ఆహార పదార్థాలను తనిఖీచేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, సెప్టెంబరు 2 : పశ్చిమ గోదావరి జిల్లా నుంచి విజయవాడకు 50 వేల ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్లను తరలించామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఆదివారం రాత్రి నుంచి జిల్లాలోని 15 ప్రాంతాలలో ఆహార పొట్లాలను సిద్ధం చేసి సోమవారం ఉదయం విజయవాడకు పంపడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. భీమవరం విష్ణు కాలేజీ, ప్రైవేట్ హోటల్‌లో తయారు చేస్తున్న ఆహార పదార్థాలను, ప్యాకింగ్, రవాణా తదితర విషయాలను కలెక్టర్ దగ్గర ఉండి స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెంలలోని వివిధ ప్రాంతాల్లో ఆహారాన్ని తయారు చేయించి 50 వేల ఆహార పొట్లాలు, వాటర్ బాటిల్స్ వాటర్ ప్యాకెట్లు 50 వేల చొప్పున, లక్షా 14 వేల 50 బిస్కెట్ ప్యాకెట్లను 14 వాహనాల్లో విజయవాడకు పంపామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మరిన్ని ఆహార పొట్లాలను సరఫరా చేయాల్సి వస్తే అధికారులను, సిబ్బందిని సిద్ధంగా ఉండాలని ఆదేశించామన్నారు. గోదావరి విద్యా వికాస్ చైతన్య సొసైటీ, భారతి విద్యా భవన్ ఆవరణలోను, తాడేపల్లిగూడెం ప్రైవేటు హోటల్స్‌లో తయారు చేస్తున్న ఆహార పదార్థాలను సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి స్వయంగా పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి ఆర్డీవో బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, తాడేపల్లిగూడెం తహసీల్దార్, ఎం.అనిల్ కుమార్, డీటీ రవిశంకర్, మధ్యాహ్న భోజన పథకం కో ఆర్డినేటర్ కృష్ణారావు, సోమేశ్వరరావు, భారతి విద్యా భవన్ స్కూల్ ఏవో యూఆర్‌కే రాజు, విద్యా కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.



ఆహార పదార్థాల తయారీపై ఆరా తీస్తున్న జేసీ రాహుల్ రెడ్డి, డీఈవో నాగమణి

ఏలూరు సిటీ/ఏలూరు టూ టౌన్, సెప్టెంబరు 2 : జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఆహార పదార్థాలను సోమవారం ఉదయం, సాయంత్రం విజయవాడకు తరలించారు. మొత్తం లక్షా 25 వేల ఆహార ప్యాకెట్లు, లక్షా 20 వేల పాల ప్యాకెట్లు, లక్ష బిస్కట్ ప్యాకెట్లు, 30 వేల బ్రెడ్ ప్యా కెట్లు, రెండు లక్షల వాటర్ ప్యాకెట్లు , 50 వేల కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలను రోడ్డు మార్గాన విజయవాడకు వాహనాలలో తరలించారు. ఉదయం ఏలూరులోని గోకుల్ కల్యాణ మండపం, ఇతర కేటరింగ్‌ల వద్ద, సాయంత్రం పత్తేబాదలో ఉండవల్లి అపార్టుమెంట్‌లో యుద్ధ ప్రాతిపదికన ఆహార పదార్థాలను జిల్లా యంత్రాంగం తయారు చేయించింది. గోకుల్ కల్యాణ మండపంలో ఆహార పదార్థాల తయారీని కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్వయంగా పరిశీలించారు. ఆహార తయారీకి ఉపయోగించే కాయగూరలు, బియ్యం, తదితర వస్తువుల నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. ఆహార తయారీ అనంతరం జిల్లా అధికారులతో కలిసి రుచిచూసి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆహార తయారీ నుంచి ప్యాకింగ్ వరకు ఎక్కడా ఎటువంటి పొర పాట్లు జరగకుండా ఉండేందుకు జిల్లా అధికారులు స్వయంగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశి ంచారు. కలెక్టర్ ఆదేశాలతో జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సత్యనారాయణ, ఆర్డీవో ఖాజావలి, ఏలూరు కమిషనర్ భానుప్రతాప్, గృహనిర్మాణ శాఖ పీడీ శ్రీనివాస్ , ఏలూరు తహసీల్దార్ శేషగిరి, ఏలూరు నగర పాలక అధికారులు ఆహార పదార్థాల తయారీని దగ్గరుండి పర్యవేక్షించారు. ఇక పాలప్యాకెట్ల రవాణాను జిల్లా పంచాయతీశాఖాధికారి శ్రీనివాస్ విశ్వనాథ్ స్వయంగా పర్యవేక్షించారు. విజయవాడలో పారిశుధ్య పనులు చేసేం దుకు ఏలూరు నగర పాలక సంస్థలో పని చేస్తున్న 150 మంది పారిశుధ్య కార్మికులను తరలించారు. శ్రీసత్యసాయి సేవా ట్రస్టు ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలు, పది వేల వాటర్ ప్యాకెట్ల మినీ వ్యానుకు ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే బడేటి చంటి ఆదేశాలతో భోజనాలు తయారు చేసి పంపుతున్నామని నగర మేయర్ నూర్జహాన్ పెదబాబు తెలిపారు. ఆహారపదార్థాల లారీని మేయర్ దంపతులు జెండా ఊపి ప్రారంభించారు. నగర కమిషనర్ భానుప్రతాప్, అడిషనల్ కమిషనర్ సీహెచ్ చంద్రయ్య దగ్గరుండి ఏర్పాట్లు చేశారని అన్నారు. రెవెన్యూ, మెప్మా సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ సిబ్బంది ఆహార పొట్లాల ప్యాకింగ్‌లో పాల్గొన్నారు.



ఆహార పదార్థాల పార్శిళ్లను పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి



విజయవాడకు మందుల కిట్లు పార్సిల్ చేస్తున్న కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టులు

బెజవాడకు భీమవరం మందులు

భీమవరం క్రైం, సెప్టెంబరు 2 : బెజవాడ నగరంపై బుడమేరు విరుచుకుపడడంతో లక్షలాది మంది వరద ముంపులో విలవిల్లాడుతున్నారు. దీంతో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ వేగంగా స్పందించారు. అత్యవసర మందుల కిట్లును రాత్రికి రాత్రి సిద్ధం చేసి తెల్లవారేసరికి బెజవాడ విమానాశ్రయానికి చేర్చి ఉన్నతాధికారులకు అందజేశారు. వరద బాధితకులకు మందులు పంపించాలని ఉన్నతాధికారులు నుంచి ఆదివారం రాత్రి సమాచారం అందడంతో జిల్లా డ్రగ్ కంట్రోల్ ఆఫీసర్ అబిబ్ ఆలీషేక్ అప్రమత్తమయ్యారు. భీమవరం డ్రగ్ అండ్ కెమిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులకు రాత్రి 12 గంటల సమయంలో విషయం తెలియజేశారు. దీంతో అసోసియేషన్ సభ్యులు అర్ధరాత్రి మందులు, సిరప్స్ ఓఆర్ఎస్ ప్యాకెట్లతో 2,500 కిట్లు సిద్ధం చేశారు. సోమవారం తెల్లవారేసరికి బెజవాడ ఎయిర్ పోర్టుకు పంపించి రాష్ట్రంలోనే తొలిగా మందులు పంపినందుకు అభినందనలు అందుకున్నారు.

నరసాపురం నుంచి వెయ్యి కిట్లు

నరసాపురం టౌన్ : నరసాపురం మెడికల్ అసోసియేషన్ తమ వంతు సాయంగా సుమారు రూ. 50 వేలు విలువ చేసే వెయ్యి మందుల కిట్‌లను పంపిణీ చేసింది. వీటిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు అత్యవసర మందులు, జ్వరం, డయారియా, ఇతర యాంటీ బైయోటిక్స్ మందులున్నాయి. సంఘం అధ్యక్షుడు చెన్నంశెట్టి నాగు అధ్వర్యం లో అన్ని షాపుల నుంచి మందుల్ని సేకరించారు. వాటిని బాక్స్‌లో పెట్టి విజయవాడ పంపించారు. డ్రగ్ ఇనస్పెక్టర్ మల్లిఖార్జురావు, పి.సత్తిబాబు, కె.నాగబాబు, జి.సూరిబాబు, సీతరామరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు నుంచి 2,500 కిట్లు

ఏలూరు రూరల్ : ఏలూరు కెమిస్ట్, డ్రగిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్, ఏలూరు కెమిస్ట్, డ్రగిస్ట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అత్యవసర మందుల కిట్‌లను సోమవారం విజయవాడ పంపించారు. సుమారు 2,500 కిట్లు, మందులు వేసుకునే విధానాన్ని కరపత్రాలు ముద్రించి కార్గో ద్వారా వరద రిలీఫ్ ఫండ్‌కు పంపించినట్లు అధ్యక్షుడు రవిచంద్ర తెలిపారు. మందులతో వెళుతున్న వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఉపాధ్యక్షులు కె.కిషోర్, కార్యదర్శి సయ్యద్ బాజీద్, కోశాధికారి ఎం.వెంకట్రావు, కె.రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.



నరసాపురంలో మందుల కిట్‌లను పంపిణీ చేస్తున్న మెడికల్ అసోసియేషన్

విజయవాడకు విద్యుత్ రెస్క్యూ టీంలు

ఏలూరుసిటీ, సెప్టెంబరు 2: విజయవాడలో వరద బాధిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను మెరుగుపరచటానికి ఏలూరు విద్యుత్ సర్కిల్ (ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా) నుంచి 30 టీమ్‌లు విజయవాడకు తరలి వెళ్ళాయని విద్యుత్ శాఖ చెబుతోంది. ఆ శాఖ సీఎండీ ఆదేశాల మేరకు ఈ జిల్లాలోని 217 మంది సభ్యులు ఈ టీంలలో ఉన్నారని విద్యుత్ శాఖ పేర్కొంది. వరద బాధిత ప్రాంతాల్లో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ సరఫరా మెరుగుపరచటానికి చర్యలు చేపడతారు. విరిగి పోయిన విద్యుత్ స్తంభాలను స్థానే మరొకటి వేయడం, వీధి లైట్లను ఏర్పాటు చేయడం, దెబ్బతిన్న ట్రాన్స్ ఫార్మర్లను మార్పు చేయర్చడం, దెబ్బతిన్న విద్యుత్ లైన్లను మార్పు చేయటం వంటి పనులను ఈ రెస్క్యూ టీం చేపడుతుందని, పూర్తిగా విద్యుత్ సరఫరాను మెరుగుపరిచే వరకు రెస్క్యూ టీంలు అక్కడ పని చేస్తాయని చెబుతున్నారు.

150 మంది పారిశుధ్య కార్మికులు, 22 బోట్లు తరలింపు

ఏలూరు సిటీ, సెప్టెంబరు 2 : కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు జిల్లా మత్స్య శాఖాధికారులు ఎన్టీఆర్ జిల్లాకు ఏలూరు జిల్లా నుంచి 22 బోట్లను పంపించారు. కలిదిండి నుంచి 15, కైకలూరు నుంచి ఐదు, పట్టిసీమ ఫెర్రీ నుంచి రెండు పడవలు ఎన్టీఆర్ జిల్లాకు తరలించినట్లు జిల్లా మత్స్యశాఖాధికారి నాగలింగాచారి తెలిపారు. ఈ బోట్లలో 20 దేశీయ పడవలు, 2 ఫైబర్ బోట్లు ఉన్నాయి. విజయవాడకు పారిశుధ్య పనులు చేసేందుకు ఏలూరు నగర పాలక సంస్థలో పని చేస్తున్న 150 మంది పారిశుధ్య కార్మికులను విజయవాడకు తరలించినట్లు నగర కమిషనర్ ఎ.భానుప్రతాప్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల నుంచి విజయవాడ కు పారిశుధ్య కార్మికులను తరలిస్తున్న క్రమంలో భాగంగా ఏలూరు నుంచి కూడా పారిశుధ్య కార్మికులను పంపించామని తెలిపారు.



పోలవరం నుంచి పడవలు తరలిస్తున్న రెవెన్యూ సిబ్బంది



ద్వారకాతిరుమల ఆహార పొట్లాల తయారీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి



ఆహారాన్ని తయారు చేయిస్తున్న ఏలూరు మేయర్ నూర్జహాన్



జంగారెడ్డిగూడెంలో వంటల తీరును పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి



ఏలూరు నుంచి విజయవాడకు సిద్ధమైన ఆహార పదార్థాల వ్యాన్



ఏలూరులో వ్యానుకు జెండా ఊపుతున్న ఎస్పీ కిశోర్

మేమున్నామంటూ..

ద్వారకాతిరుమల , సెప్టెంబరు 2 : చినవెంకన్న ఆలయం నుంచి 15 వేల ఆహార పొట్లాలను, మంచినీటి ప్యాకెట్లను గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో రెండు విడతలుగా సోమవారం సాయంత్రం పంపించారు. ఇందు నిమిత్తం అయిన ఖర్చు ఆలయ ఉద్యోగుల ఒకరోజు జీతం సుమారు రూ. మూడు లక్షలను జమ చేసినట్లు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. దేవస్థానం అంబరఖానాలో ముందుగా ఐదు వేల పొట్లాలు, ఆ తరువాత మరో 10 వేల పొట్లాలను పంపించినట్లు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు వివరించారు.

● పాలకొల్లు అర్బన్ : స్థానిక శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానం నుంచి రెండు వేలు, రేపాక వారి సత్రం నుంచి వెయ్యి ఆహార పొట్లాలను విజయవాడకు పంపించినట్టు దేవస్థానం ఈవో శ్రీనివాసరావు, సత్రం ఫ్యామిలి ఫౌండర్ మెంబర్, ఛైర్మన్ రేపాక శ్రీనివాసరావు తెలిపారు.

● జంగారెడ్డిగూడెం : జేసీ ధాత్రి రెడ్డి ఆదేశాల మేరకు ఆహార పదార్థాలను మెప్మా మహిళల సహకారంతో పార్శిల్ చేయించి మినీ వ్యాన్‌లలో విజయవాడ పంపిచామని తహసీల్దార్ కె.స్లీవజోజి తెలిపారు. జేసీ ధాత్రి రెడ్డి వంటల తీరును పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్, ఐటీడీఏ ఈఈ రాంబాబు, ఎంపీడీఓ కేవీ ప్రసాద్, సీఎస్‌డీటీ వైవీ లక్ష్మీకుమారి, డిప్యూటీ తహసీల్దార్ కె.రమేష్ తదితలు సహకరించారు. అలాగే స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వ్యాపారస్తుల వద్ద సేకరించిన రూ.లక్షన్నర విలువ చేసే నిత్యావసర సరుకులను విజయవాడకు పంపారు. డీఎస్పీ రవిచంద్ర, యు.గంగాధర్, బలరాం రాంబాబు, బాపిరాజు, ఎస్.శ్రీనివాసరావు, వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

ఏలూరు అర్బన్/బుట్టాయగూడెం, సెప్టెంబరు 2 : ఏలూరు సత్రంపాడులోని ప్రభుత్వ ఐటీఐలో, బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఘంటా సుధాకర్ తెలిపారు.

రైళ్లు రద్దు.. దారి మళ్లింపు

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 2 : భారీ వర్షాలకు రైల్వే ట్రాక్‌లు దెబ్బతిడంతో ఏలూరు మీదుగా వెళ్లే 15 రైళ్లను ఈ నెల మూడున రద్దు చేశారు. మరి కొన్నింటిని నాలుగో తేదీన రద్దు చేసినట్టు విజయవాడ సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు.

రద్దయిన రైళ్లు

12806 లింగంపల్లి - విశాఖపట్టణం 3వ తేదీన రద్దు
17016 సికింద్రాబాద్ - భువనేశ్వర్ 3వ తేదీ వరకు రద్దు,(ఏలూరులో 4వ తేదీ)
07165 హైదరాబాద్ - కటక్ 3వ తేదీ వరకు రద్దు (ఏలూరులో 4వ తేదీ)
07166 కటక్ - హైదరాబాద్ 4వ తేదీ వరకు రద్దు (ఏలూరులో 5వ తేదీ)
12703 హౌరా - సికింద్రాబాద్ 2వ తేదీ రద్దు (ఏలూరులో 3వ తేదీ)
22863 హౌరా - ఎస్ఎంవీటీ బెంగళూరు 2వ తేదీ రద్దు (ఏలూరులో 3వ తేదీ)
12740 సికింద్రాబాద్ - విశాఖపట్టణం 3వ తేదీ రద్దు
18189 టాటానగర్ - యర్నాకుళం 2వ తేదీ రద్దు (ఏలూరులో 3వ తేదీ)
22605 పునలియా - తిరునెల్వెల్లి 2వ తేదీ రద్దు (ఏలూరులో 4వ తేదీ)
12841 షాలిమార్ - చెన్నై సెంట్రల్ 2వ తేదీ రద్దు (ఏలూరులో 3వ తేదీ)
06082 షాలిమార్ - కొచ్చివెల్లి 2వ తేదీ రద్దు (ఏలూరులో 3వ తేదీ)
12665 హౌరా - కన్యాకుమారి 2వ తేదీ రద్దు (ఏలూరులో 3వ తేదీ)
22841 సత్రగంజి - తాంబ్రం 2వ తేదీ రద్దు (ఏలూరులో 3వ తేదీ)
22837 అట్టాయ్ - యర్నాకుళం 2వ తేదీ రద్దు (ఏలూరులో 3వ తేదీ)
22860 చెన్నై సెంట్రల్ - పూరీ 2,3 తేదీలలో రద్దు (ఏలూరులో 4వ తేదీ)
12862 మహబూబ్‌నగర్ - విశాఖపట్టణం 3వ తేదీ రద్దు (ఏలూరులో 4వ తేదీ)
12861 విశాఖపట్టణం - మహబూబ్‌నగర్ 3వ తేదీ రద్దు
08584 తిరుపతి - విశాఖపట్టణం 3వ తేదీ రద్దు (ఏలూరులో 4వ తేదీ)

దారి మళ్లించిన రైళ్లు

18046 హైదరాబాద్-షాలిమార్ సికింద్రాబాద్ నుంచి పగిడిపల్లి, గుంటూరు, కృష్ణాకెనాల్, విజయవాడకు చేరుకుంటుంది.
12737 కాకినాడ పోర్టు-లింగంపల్లి విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి, సికింద్రాబాద్ మీదుగా వెళ్తుంది.
12738 లింగంపల్లి-కాకినాడ పోర్టు, సికింద్రాబాద్, పగిడిపల్లి, గుంటూరు, విజయవాడగా వస్తుంది.
16093 చెన్నై సెంట్రల్-లక్నో విజయవాడ, దువ్వాడ, విజయనగరం, రాయగడ, టిట్లాఘర్, నాగపూర్ మీదుగా వెళ్తుంది.
12651 మధురై-హజరత్ నిజాముద్దీన్, విజయవాడ, దువ్వాడ, విజయనగరం, రాయగడ, తిట్లఘర్, రాయపూర్, నాగపూర్ మీదుగా వెళ్తుంది.

ట్రిపుల్ ఐటీ ఫుడ్ కాంట్రాక్టర్లపై కేసు

నూజివీడు, సెప్టెంబరు 2: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీ ఫుడ్ కాంట్రాక్టర్లపై సోమవారం కేసు నమోదైంది. ఐదు రోజులుగా ట్రిపుల్ ఐటీలోని రెండు మెస్సుల్లో నాసిరకం ఆహారం విద్యార్థులకు అందించటం, మెస్‌ల పరిస్థితిపై వరుస కథనాలు రావడంతో స్పందించిన మంత్రి నారాలోకేశ్ విచారణ కమిటీని నియమించారు. కమిటీ నివేదికతో ఆయన ఫుడ్ కాంట్రాక్టర్ల పై కేసు నమోదు చేయాలని నూజివీడు ట్రిపుల్ ఐటీ అధికారులను ఆదేశించారు. ఈ ఇద్దరు కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. కొత్త కాంట్రాక్టర్లను నియమించే వరకు ఈ ఐటీలోనే మూడో మెస్ నడుపుతున్న కేఎంకే కేటరింగ్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కొత్త టెండర్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని అధికారులకు మంత్రి సూచించారు. దీంతో ఫైన్ క్యాట రర్స్ అండ్ సప్లయిర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ ఘోష్, అనూష హాస్పిటాలిటీ సర్వీసెస్ ఎండీ పి.వెంకట నారాయణపైన ట్రిపుల్ ఐటీ అధి కారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అజ్ఞాతంలోకి నిర్వాహకులు

మెస్ భోజన అంశంలో ఆరోపణల అనంతరం పరిస్థితిని చక్కదిద్దేందుకు నూజివీడు వచ్చిన ఫైన్ కేటరర్స్ నిర్వాహకుడు ఘోష్ కేసు నమోదు అనంతరం అజ్ఞాతంలోకి వెళ్ళినట్లు సమాచారం. ప్రభుత్వం మెస్ నిర్వహణల తీరుపై సీరియస్‌గా ఉన్న దృష్ట్యా నిర్వాహకులపై నమోదు అయిన కేసు విషయంలో వారు స్టే ద్వారా అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లుగా వినికిడి.

కమిటీ సిఫార్సులు

ఆహార నాణ్యత పర్యవేక్షణకు స్టూడెంట్ మెస్ కమిటీని నియమించి, స్టాల్స్ భోజన ప్రాంతం, వంటిగది ప్రాంతాలను విద్యార్థులతో కూడిన మరో మెస్ కమిటీని నియ మించి పర్యవేక్షించాలి. ప్రతి డైనింగ్ హాల్లోనూ ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలి. ఆహార తనిఖీ కోసం ఇద్దరు ఫుడ్ సేఫ్టీ తనిఖీ అధికారులను నియమించాలని సిఫార్సు చేసినట్లు సమాచారం.

రేపు హార్టీకల్చర్ డిప్లొమా మాన్యువల్ కౌన్సిలింగ్

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 2: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని గుర్తింపు పొందిన నాలుగు డిప్లమో కళాశాలలో మాన్యువల్ కౌన్సిలింగ్ బుధవారం నిర్వహించనున్నట్టు రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు తెలిపారు. పదోతరతి ఉత్తీర్ణత సాధించి ఇప్పటి వరకూ డిప్లొమా కోర్సుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బుధవారం వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన విశ్వవిద్యాలయ మీటింగ్ హాల్‌లో ఈ మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు పదో తరగతి మార్కుల మెమో, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేని వారు రూ.800 మాన్యువల్ ఫీజు, బదిలీ సర్టిఫికెట్స్, నాలుగు నుంచి 10వ తరగతి వరకూ స్టడీసర్టిఫికెట్స్, గేమ్స్, ఎన్‌సీసీ, సీఏపీ, పీహెచ్ తదతర సర్టిఫికెట్‌లు ఉంటే ఒరిజినల్స్ తీసుకురావాల్సి ఉంటుందని వివరించారు.

నారాయణపురం డిగ్రీ కళాశాలలో నాక్ బృందం పర్యటన

ఉంగుటూరు, సెప్టెంబరు 2 : మండలంలోని నారాయణపురం శ్రీఅరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నాక్ పీర్ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు సర్పంచ్ దిడ్ల అలకనంద, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి స్వాగతం పలికారు. నాక్ బృందంలో మధ్యప్రదేశ్‌కు చెందిన అమితాబ్ సక్సేనా, ప్రొఫెసర్ ఎన్‌వీఆర్ జ్యోతి కుమార్, డాక్టర్ మీనాక్షి వాకోలే, రీజినల్ డైరెక్టర్ శోభారాణి, ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు, అధ్యాపక బృందం పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు ఈపూరి సత్యనారాయణ, ఆదిరెడ్డి సత్యనారాయణ, బొమ్మిడి అప్పారావు, యెలిశెట్టి పాపారావు బాబ్జి పాల్గొన్నారు. నాక్ పీర్ కమిటీ కళాశాల ప్రాంగణంతో పాటు జేకేసీ సెంటర్‌ను సందర్శించి కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న నాక్ బృందం

క్రైం కార్నర్

బిల్డింగ్‌పై నుంచి పడి కార్మికుడి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 2 : తాపీ పనికి వెళ్ళిన ఒక కార్మికుడు ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి పడి మృతి చెందాడు. గుంటూరుకు చెందిన వెంకటేశ్వరరావు 20 ఏళ్లగా పోణంగి రోడ్డులో ఉంటూ గుండుబోయిన రామకృష్ణ అనే తాపీ మే స్త్రీ వద్ద పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం యధావిధిగా ఏలూరు మినీ బైపాస్ రోడ్డులోని ఒక భవన నిర్మాణ పనికి వెళ్ళాడు. అక్కడ బిల్డింగ్ పై నుంచి ప్రమాదవశాత్తు వెంకటేశ్వరరావు జారి పడ్డాడు. తోటి కార్మికులు వెంటనే అతనిని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్ళారు. ఆస్పత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

రైలు నుంచి దిగుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 2 : రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నెమ్మదిగా వెళ్తుతూ ఉండడంతో ఆ రైలు అక్కడ ఆగ దేమోనని దిగడానికి ప్రయత్నిస్తూ ఆ రైలు కిందే పడి తీవ్ర గాయాలకు గురై మృతి చెందాడు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా కాజీపేటకు చెందిన తిప్పాని వీరభద్రుడు (50) ఫోటో గ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. ఏలూరులో ఉన్న బంధువుల ఇంటికి రావడానికి ఈ నెల ఒకటో తేదీన రైలు ఎక్కాడు. ఆ రైలు గుడివాడ, కైకలూరు, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా దారి మళ్ళించారు. బంధువులకు ఫోన్ చేయగా ఆ రైలు కైకలూరులో ఆగుతుందని అక్కడ దిగితే తాము వస్తామని చెప్పారు. అర్ధరాత్రి ఆ రైలు కైకలూరు రైల్వే స్టేషన్ సమీపంలో నెమ్మదిగా వెళ్తుంది. రైలు ఆగదేమో అనుకుని నెమ్మదిగా వెళ్తుంది కదా అని వీరభద్రుడు కిందకు దూకేశాడు. దీంతో రైలు ప్లాట్ ఫాంకు, రైలుకు మధ్యలో పడి కాలు తెగిపోయింది. రైలు ఆగింది. అయితే అప్పటికే బంధువులు కారు వేసుకుని అతనికి కోసం ఎదురు చూస్తున్నారు. రైలు కింద పడి కాలు కోల్పోయిన అతనిని వెంటనే ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. ఆస్పత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై భీమవరం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహనికి ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం జరిపి బంధువులకు అప్పగించారు.

వ్యభిచార గృహం నిర్వాహకురాలికి జైలు శిక్ష

ఏలూరు క్రైం/భీమవరం క్రైం, సెప్టెంబర్ 2 : వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు ఒక మహిళపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష, నాలుగు వేల రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని ఐదవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి జి.రాజేశ్వరి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం భీమవరం పట్టణంలోని గునుపూడి ప్రాంతంలో ప్రగడ సాయికుమారి తన ఇంట్లో 2020లో కొంత మంది యువతులతో వ్యభిచారం నిర్వహిస్తుంది. ఈ సమాచారం అప్పటి వన్‌టౌన్ పోలీసులకు అందడంతో అప్పటి సీఐ కృష్ణభగవాన్ దాడి చేసి ఆమెపై ఐటీపీ యాక్టు కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు ఏలూరులోని 5వ అదనపు సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. ప్రధాన నిందితురాలైన ప్రగడ సాయికుమారిపై నేరం రుజువు కావడంతో ఐదు సంవత్సరాలు జైలు శిక్ష, నాలుగు వేల రూపాయలు జరిమానా విధిస్తూ జడ్జి రాజేశ్వరి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున డీవీ రామాంజనేయులు వాదించగా ప్రాసిక్యూషన్‌కు భీమవరం వన్‌టౌన్ సీఐ నాగరాజు, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ సహకరించారు.

బంగారం, వెండి చోరీ

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 2: తాడేపల్లిగూడెం పట్టణంలోని ఓ ఇంటి తలుపులు పగలగొట్టి దుండగులు చోరీకి పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గాయత్రీదేవి ఆలయం సమీపంలో నివాసముంటున్న గోపి విజయలక్ష్మి తన కుమారుడు ఇంటికి వెళ్లేందుకు తన ఇంటికి తాళం వేసి వెళ్లారు. అయితే సోమ వారం ఉదయం తిరిగి వచ్చేసరికి తాళాలు పగలగొట్టినట్టు గుర్తించి లోపలికి వెళ్లి చూసే సరికి పది కాసుల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి, రూ.30 వేల నగదు దోచుకున్నట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాగరాజు తెలిపారు.

హత్య కేసు వేగంగా దర్యాప్తు : సీఐ

భీమవరం క్రైం, సెప్టెంబరు 2 : స్థానిక 38వ వార్డు లంకపేట సమీపంలో ఆదివారం రాత్రి ఇద్దరి మధ్య నగదు విషయంలో జరిగిన ఘర్షణలో సైకం నాగరాజు అనే వ్యక్తి మృతి చెందగా ఆకుల తులసీవరప్రసాద్ (నాని) తీవ్రంగా గాయపడి ప్రస్తుతం కోమాలో ఉన్నట్లు టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ తెలిపారు. అయితే అతను ప్రస్తుతం ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో ఉన్నట్లు తెలిపారు. వీరిద్దరి మధ్య నగదు విషయంలో తగాదా జరిగినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కొందరు క్షణికావేశంలో ఇలాంటి తప్పలు చేసి జీవితాంతం బాధపడుతున్నారని ఎవరైనా ఒకసారి ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని సీఐ కోరారు.

సమస్యల పట్టణం



జంగారెడ్డిగూడెం

పురపాలక కార్యాలయంలో సిబ్బంది కొరత

పడకేసిన పారిశుధ్యం

పబ్లిక్ పార్కుల ఊసే లేదు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 2: పట్టణం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు, పాలకవర్గం విఫలం కాగా కార్యాలయంలో సిబ్బంది లేకపోవడంతో పౌర ప్రజలకు ఆలస్యమవుతున్నాయి. పారిశుధ్యం సిబ్బంది కొరతతో పట్టణంలో పరిశుభ్రత లోపించింది. కీలకమైన టౌన్ ప్లానింగ్ విభాగం అస్తవ్యస్తంగా తయారైంది. ఇక్కడ టౌన్ ప్లానింగ్ అధికారి (టిపిఓ) ఎం.వెంకట్రావు విధుల్లో చేరిన కొంతకాలానికే సెలవుపై వెళ్లారు. టౌన్ ప్లానింగ్ సెక్రటరీ (టీపీఎస్) పోస్టు రెండేళ్లుగా ఖాళీగా ఉంది. వార్డు సచివాలయంలో వార్డు ప్లానింగ్ సెక్రటరీకి టీపీబీవోగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మున్సిపల్ కమిషనర్, మేనేజరు పోస్టులు కాకుండా సుమారు 47 మంది ఉద్యోగులు పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం 26 మంది మాత్రమే ఉన్నారు. ఇద్దరు ఏఈలకు ఒక్కరే ఉన్నారు. డీఈ పోస్టు భర్తీ చేయలేదు, ఉన్న ఒకే ఒక శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కూడా బదిలీ అయ్యారు. ఆర్ఐ పోస్టు కూడా ఖాళీ కావడంతో సీనియర్ అసిస్టెంట్ ఇన్‌చార్జి ఆర్ఐ విధులు నిర్వహిస్తున్నారు. పట్టణంలో 140 మంది పారిశుధ్య సిబ్బంది అవసరంగా కాగా 92 మంది మాత్రమే ఉన్నారు. దీంతో ప్రతీరోజు ప్రజల ఇళ్ళ నుండి సేకరించ వలసిన వ్యర్థాలను రెండు మూడు రోజుల వరకూ సేకరించడక పోవడం పట్టణంలో పారిశుధ్యం కొరవడింది. పట్టణంలో పబ్లిక్ పార్కుల ఊసే లేదు. ఎంపీ, ఎమ్మెల్యేలు మున్సిపాలిటీపై ప్రత్యేక దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న పాఠశాలల పారిశుధ్య సిబ్బంది

పాఠశాలల పారిశుధ్య సిబ్బంది ధర్నా

ఏలూరు రూరల్, సెప్టెంబరు 2: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్ (టాయ్‌లెట్ క్లీనర్స్) 1900 మందికి రావాల్సిన బకాయి జీతాలు తక్షణం ఇప్పించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ ఐదు నెలల వేతనాలు లేకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. పాఠశాలల్లో క్లీనింగ్, పరిశుభ్రత కోసం కృషిచేస్తున్న వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు పీవీ.నరసింహారావు మద్దతు తెలిపారు. యూనియన్ జిల్లా కన్వీనర్ కె.విజయలక్ష్మి, నాయకులు సోమయ్య, దుర్గారావు మాట్లాడారు. 6వేలు నామమాత్రపు వేతనాలు కూడా చెల్లించకపోవడం దారుణమన్నారు. జిల్లా అధికారులు తక్షణం స్పందించి బకాయి జీతాలు ఇప్పించాలని కోరారు. పి.దుర్గ, గౌసియా, దుర్గా, లక్ష్మిబాలాజి, అనంతలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

పెదవేగి, సెప్టెంబరు 2: అధిక వర్షాలతో నీట మునిగిన వరి తెగుళ్లబారిన పడే ప్రమాదం ఉందని, తక్షణం సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏలూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త కె.ఫణికుమార్ అన్నారు. మాగుడు తెగులు, ఆకుముడత తెగులు, ఎండాకు తెగులు సోకే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. పిలకల దశలో నీట మునిగిన ఐదు రోజుల వరకు వరి పంట బతికే అవకాశం ఉందని, కొన్ని రకాలు వారం రోజుల వరకు బతుకుతాయని ఆయన తెలిపారు. పిలకల దశలో వరికి నీరు తగ్గిన తరువాత ఎకరానికి 20 కిలోల యూరియా, 2 0కిలోల పొటాష్ వేయాలన్నారు. ఆకు ఎండు తెగులు బాక్టీరియా ఆశించే అవకాశం ఉందని, తెగులు లక్షణాలు కన్పిస్తే, నత్రజని ఎరువుల వాడకాన్ని నిలిపేసి, పొటాష్ ఎరువులను వాడాలని ఆయన సూచించారు.

పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

ఉంగుటూరు, సెప్టెంబరు 2: భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. కైకరంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వలన జిల్లాలో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా పరిహారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో గుత్తికొండ శ్రీనివాసరావు, కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 2: నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ సూచించారు. జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ తన సిబ్బందితో నిర్వహించారు. ప్రధాన కూడళ్ళల్లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. చిరు వ్యాపారులు ట్రాఫిక్‌నకు అంతరాయం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.



తాళ్లమూడి వైఎస్ఆర్ కాలనీ ముంపులోనే ఇళ్లకు వెళుతున్న బాధితులు



పెదపాడు మండలం వెంకటాపురంలో చెరువును తలపిస్తున్న చేలు



నీట మునిగిన చేలో తేలుతున్న వరి నారు

వరద.. నష్టం..

• వీడని ముంపు • ఉధృతంగా తమ్మిలేరు

పెదపాడు, సెప్టెంబరు 2: వరద పోటెత్తడంతో చేలు, ఇళ్లు మునిగి ప్రజలు, రైతులు నష్టపోయారు. నష్టపోయిన ప్రతి రైతు, బాధితులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. నీట మునిగిన వెంకటాపురం, ఖాజీగూడెం, సత్యవోలు, కడిమికుంట, గోగుంట, పెదపాడు చేలను ఎమ్మెల్యే చింతమనేని మంగళవారం పరిశీలించారు. కడిమికుంటలో చేలో దిగి వరి పంటను పరిశీలించారు. మండలంలో సుమారు మూడువేల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందన్నారు. సమీప ప్రాంతాల్లో దొరికే నారును తీసుకువచ్చి మరలా నాట్లు వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న రోజుల్లో కాలువలు, డ్రెయిన్లను పూడికతీత, మరమ్మతు చేస్తామన్నారు. ఘంటశాల వెంకటలక్ష్మి, ఉప్పలపాటి రాంప్రసాద్, బొప్పుడి కాశీబాబు, గుత్తా అనిల్, మోరు శ్రావణి, అక్కినేని వంశీకృష్ణ, లావేటి శ్రీనివాసరావు, కొత్తూరు చినబాబు, కలిపిండి అప్పారావు, మరడాని రవి, లావేటి హేమసుందర్, పెద్దిరెడ్డి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి

ఏలూరు రూరల్: పాలగూడెం, సుంకరవారితోట, చాటపర్రు, కె.డిపురం, జాలిపూడి, లింగారావుగూడెం తదితర ప్రాంతాల్లో సుమారు 6వేల ఎకరాల్లో వరి నీట మునిగింది. చేలలో నీటిని తొలగించే పరిస్థితి లేకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

కొనసాగుతున్న వరద..

ఏలూరు క్రైం: భారీ వర్షాలతో వరద నీరు జలాశయాల్లో చేరింది. నీటిని దిగువకు విడుదల చేయడంతో కాలువలు పొంగుతున్నాయి. శనివారపుపేట కాజ్‌వేపై సోమవారం నీరు చేరింది. దీంతో రెండో రోజు కూడా రాకపోకలు నిలిపివేశారు. టూటౌన్ సీఐ వైవి రమణ కాజ్‌వే వద్ద గస్తీ ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి కూడా సీఐ రమణ శనివారపుపేట లోబ్రిడ్జి వద్ద పరిశీలించారు. త్రీ టౌన్ సీఐ ఎస్.కోటేశ్వరరావు, ఎస్ఐలు ప్రసాద్, అజయ్, సిబ్బంది మరోవైపు గస్తీ ఏర్పాటు చేశారు. తమ్మిలేరు కాలువ ఏలూరు ఎఫ్‌సీఐ గోడౌన్స్ వద్ద రెండు పాయలుగా చీలిపోయి ఒకటి తంగెళ్ళమూడి మీదుగా మార్కెట్‌యార్డు, తూర్పు లాకుల మీదుగా కొల్లేరులోకి వెళ్లిపోతుంది. మరో పాయ ఎఫ్‌సీఐ గోడౌన్స్ మీద నుంచి శనివారపుపేట మీదుగా పడమర లాకులు, పోణంగి మీదుగా కొల్లేరులో చేరుతుంది. బ్రిడ్జిలు ఉన్న ప్రాంతాలు, తూర్పు, పడమర లాకుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రానికి నీరు తగ్గవచ్చునని భావిస్తున్నారు.

కొల్లేరు ప్రాంతానికి వరద ముంపు పొంచిఉందని, ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్ఐ సిహెచ్ దుర్గా ప్రసాద్ సూచించారు. లింగారావుగూడెంలో స్థానికులతో ఆయన మాట్లాడారు. వరద ప్రవాహం తమ్మిలేరు నుంచి దిగువ ప్రాంతాలకు వస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందస్తుగా ఆయా ప్రాంతాల్లో పోలీసు గస్తీ ఏర్పాటు చేస్తున్నామని, ప్రాణ నష్టం, ఆస్థి నష్టం లేకుండా చూసుకోవాలన్నారు.

సీతారామపురంలో దెబ్బతిన్న పంట

● కుక్కునూరు: సీతారామనగరంలో కిన్నెరసానివాగు పంటలపై నుంచి ఉధృతంగా ప్రవహించడంతో పంటలు దెబ్బతిన్నాయి. సోమవారం ఏవో బాలాజీ పంటలు పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. 90ఎకరాల్లో వరి, 15ఎకరాల్లో పత్తి దెబ్బతిన్నట్లు తెలిపారు. నీరు పారుదల ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. సీతారామనగరంలో దెబ్బతిన్న సీసీ.రహదారులకు మరమ్మతులు చేయడంతో పాటు గ్రావెల్ కొట్టుకుపోవడంతో తిరిగి మళ్ళీ గ్రావెల్ నింపుతున్నారు. మరమ్మత్తులు చేపట్టారు. తహసీల్దార్ పెద్దిరాజు రహదారి పనులు పర్యవేక్షించారు.









దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కడిమికుంటలో నీట మునిగిన వరి చేలు, తాళ్లమూడిలో ముంపు బాధితులకు కూరగాయల పంపిణీ, సీతారామనగరంలో దెబ్బతిన్న పంట పరిశీలన

ఆరోగ్య పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కృష్ణకిషోర్

లింగపాలెం, సెప్టెంబరు 2: ఆరోగ్య పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కృష్ణకిషోర్ అన్నారు. కె.గోకవరం పీహెచ్‌సీ పరిధిలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వర్షాకాలం వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, ఇప్పటికే గ్రామాల్లో జ్వరాలు ఉన్నాయన్నారు. కాచిచల్లార్చిన నీటినే తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్య సిబ్బంది ప్రతిరోజూ గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారని, ఎవరికైనా అనారోగ్య సమస్యలు వెంటనే వారిని సంప్రదించాలని ఆయన సూచించారు. ఆయనతో పాటు పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 2: మహిళల ఆరోగ్య రక్షణకు, పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని జంగారెడ్డిగూడెం సీడీపీవో పి.బ్యూల నిర్వహించారు. మండలంలోని దొరసానిపాడు సచివాలయ పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఆమె గర్భవతులు, బాలింతలకు రక్తహీనత నివారణలో అవలంభించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు టి.మేరీ, కె.మణి, జీఎంఎస్‌కే కమల, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను పరిశీలించిన డీఎఫ్‌వో



ప్లాంటేషన్ పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

జీలుగుమిల్లి, సెప్టెంబరు 2: కామయ్యపాలెం సెక్షన్ పరిధిలో ఇటీవల నాటిన మారుజాతి మొక్కల ప్లాంటేషన్‌ను జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్ర ధామ పరిశీలించారు. 10 హెక్టార్లలో పెరుగుతున్న మొక్కల పెంపకంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అటవీ భూముల్లో పలు ప్లాంటేషన్ వేస్తున్నట్లు చెప్పారు. వాటి సంరక్షణ అభివృద్ధికి నిరంతరం సిబ్బంది పర్యవేక్షణ ఉంటుందన్నారు. మొక్కల పెంపకం, సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సబ్ డీఎఫ్‌వో వెంకటసుబ్బయ్య, ఎఫ్ఆర్‌వో ఎస్‌కె.వల్లీ, ఎఫ్ఎస్‌వో బి.దినేష్, బిఎస్.పండు ఉన్నారు.

ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీకి అనుమతి లేదు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 2 : భీమడోలులోని సీబీసీఎన్‌సీ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఖాళీగావున్న సెకండరీగ్రేడ్ టీచర్(ఎస్జీటీ) పోస్టులను భర్తీకి అనుమతి ఇవ్వలేదని డీఈవో అబ్రహం తెలిపారు. తమ కార్యాలయం నుంచి అనుమతి మంజూరు చేసినట్టు ప్రచారం కావడాన్ని ఆయన తప్పుబడుతూ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వదంతులు, మధ్యవర్తుల మాటలను నమ్మవద్దని ఆయన సూచించారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 2: ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని అభ్యర్థిస్తూ ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర తదితరులు సోమవారం ఎమ్మెల్యే బడేటి చంటికి వినతిపత్రాన్ని అందజేశారు. జీవోలు 117, 128 తక్షణమే రద్దు చేయాలని, సర్‌ప్లస్ టీచర్లను సర్దుబాటు చేయడానికి వర్క్ అడ్జస్ట్‌మెంట్ ద్వారా కాకుండా అర్హులకు పదోన్నతులు ఇవ్వడం ద్వారా సబ్జెక్టు టీచర్ల కొరత భర్తీచేయాలని కోరారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను సమాంతరంగా కొనసాగించాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆనంద్‌కుమార్, శ్రీనివాస్, సాంబమూర్తి, వెంకటేశ్వరరావు, శాంతికుమార్, తదితరులున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



అవార్డులతో ఉత్తమ ఉపాధ్యాయులు

ఉంగుటూరు, సెప్టెంబరు 2: మండలం నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ముగ్గురిని ఆదివారం రాత్రి రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సత్కరించారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, నన్నయ వీసీ వై.శ్రీనివాసరావు, రెడ్డిబాబు, మతల రమేష్, చలుమూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మెరపల శ్రీనివాసరావు ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపికైన బొమ్మిడి ప్రసాద్, దారపురెడ్డి తులసీ లక్ష్మి, నల్లా శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించారు.

రూ.24.5 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

చింతలపూడి, సెప్టెంబరు 2: నియోజకవర్గంలో ఉపాధిహామీ పథకంలో రూ.24. 5కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్‌లు నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సోమవారం తెలిపారు. నియోజకవర్గంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని, సీసీ రోడ్లు, డ్రైన్‌లు నిర్మించేందుకు ఉపాధిహామీ నిధులు వినియోగిస్తామని ఆయన చెప్పారు.

వైఎస్ చిత్రపటం వద్ద కాంగ్రెస్ నేతల నివాళి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 2: కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర రెడ్డి వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా నాయకులు కోసూరి చంద్రకాంతమ్మ, కాంగ్రెస్ నాయకులు తాళ్ళూరి చక్రవర్తి, వి.ఎన్.మూర్తి, గౌడు రంగబాబు, లంకా రామ్మోహన్, ఆర్.కిషోర్, లాజర్, వేల్పు వెంకటేశ్వరరావు, ఎస్ వి.సుబ్బారావు, చెక్కా గుప్త, రాటాలు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధి రాయల సతీష్ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని గ్జేవియర్ బాలుర పాఠశాల వద్ద గల రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే రాజశేఖరరెడ్డి రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేశారని, షర్మిల నాయకత్వం వర్ధిల్లాలన్నారు. పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● చింతలపూడి: పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి మండల అధ్యక్షుడు విస్సంపల్లి సుందర్‌రావు ఆధ్వర్యంలో జరిగింది. వైఎస్ చిత్రపటానికి ముందుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన హయాంలో జరిగిన పథకాలు ప్రజలకు మేలు చేశాయన్నారు. పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, నాయకులు బుట్టాయగూడెంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజురీంబర్స్‌మెంట్ పథకాల ద్వారా పేదలు ఎంతగానో లబ్ధిపొందారని బాలరాజు గుర్తుచేశారు. అనంతరం సిహెచ్‌సిలో రోగులకు రొట్టెలు, పండ్లను పంపిణి చేశారు. అల్లూరి రత్నాజీరావు, జి.మోహనరావు, టి.రమణ, ఆర్.సత్యానారాయణ, తెల్లం చిన్నారావు, పొడియం లక్ష్మణరావు, షేక్ బాజీ పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: ఫైర్‌స్టేషన్ సెంటర్లో వైఎస్సార్ విగ్రహానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, వైసీపీ నాయకులు కారుమూరి సునీల్‌కుమార్, మామిళ్ళపల్లి జయప్రకాష్, పలువురు వైసీపీ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అంటే ఒక నమ్మకం, ఒక భరోసా అన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, పలువురు

● ఉంగుటూరు: వైఎస్ రాజశేఖరరెడ్డివర్ధంతి సందర్భంగా సోమవారం కైకరం, చేబ్రోలు, ఉంగుటూరులలో ఆయన విగ్రహాలకు వైసీపీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుప్పాల గోపి, కొరిపల్లి శ్రీను, పంతుల వెంకన్నబాబు, యెలిశెట్టి పాపారావు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

సోమవతి అమావాస్య పూజలు

నిడమర్రు, సెప్టెంబరు 2: సోమవతి అమావాస్య సందర్భంగా అడవికొలను కేశవస్వామి ఆలయంలో ప్రసన్నాంజనేయస్వామికి పూజలు చేశారు. మహిళలు స్వామి వారి ఏకాదశ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. ఆలయ అర్చకులు చక్రవర్తుల సుబ్బారావు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

● ఏలూరు కార్పొరేషన్: సత్రంపాడులోని అంబికాదేవి ఆలయ ప్రాంగణంలోని అంబికేశ్వరస్వామికి భక్తులు సామూహిక అభిషేకాలు చేశారు. అంబికా కుటుంబ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. జరాపహరేశ్వరస్వామి, మార్కండేయస్వామి, అగ్రహారం నగరేశ్వరస్వామి, ప్రతాప కాశీ విశ్వేశ్వర స్వామి, పవరుపేట అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరస్వామి, పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

● ద్వారకాతిరుమల: క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయంలో సోమావతి అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణాన్ని అలంకరించారు. గర్భాలయంలో కొలువుదీరిన శివయ్యను అర్చకులు మహన్యాసపూర్వకంగా అభిషేకించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.









రక్తదాన శిబిరంలో ఏలూరు ఎమ్మెల్యే చంటి, కొయ్యలగూడెంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, భీమడోలులో విద్యార్థినికి పురస్కారం ఇస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు, జంగారెడ్డిగూడెంలో వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోషన్

జన సేవ

ఘనంగా పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుక

అభిమానులు, కార్యకర్తల సేవా కార్యక్రమాలు

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 2: జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినం పురస్కరించుకుని జిల్లాలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఏలూరు నగరంలో పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బడేటి చంటి, రెడ్డి అప్పలనాయుడు కేక్ కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదాతలను ఎమ్మెల్యే చంటి అభినందించారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా మొక్కలు పంపిణీ చేశారు. ఏడు గోలీల సెంటర్, 12పంపుల సెంటర్, గజ్జలవారి చెరువు, బిర్లా భవన్, దొండపాడు, తూర్పువీధి, అంధుల పాఠశాల, బీడీ కాలనీ తదితర ప్రాంతాల్లో శ్రావణ కుమార్ గుప్తా, ఎ.శ్రీను, కాశీనరేష్, కృష్ణంనాయుడు, జొన్నలగడ్డ సుజాత, తోట పుష్ప ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

● ఉంగుటూరు: కైకరంలో పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు పురస్కరించుకుని జనసైనికులు పరసరాలు పరిశుభ్రం చేశారు. పంచాయతీ చెరువు చుట్టూ చెత్తను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. కేక్ కట్ చేసి వృద్ధులు, దివ్యాంగులకు పండ్లు, పేదలకు దుప్పట్లు, మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. వెజ్జు సుబ్బారావు, కోనా శ్రీనివాసరావు పాల్గొన్నారు. కైకరం హైస్కూలులో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచ్ సలగాల గోపి, చింతల శ్రీనివాస్, లింగంపల్లి మణికంఠ, ముత్యాల బాలాజి, తదితరులు పాల్గొన్నారు. వెల్లమిల్లి శివాలయంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ప్రత్యేక పూజలు చేశారు. బొమ్మిడి, యర్రమళ్ల, చేబ్రోలు, నల్లమాడులో పేదలకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు.

● నిడమర్రు: మండలంలోని క్రొవ్విడి, ఎనికేపల్లి, ఛానమిల్లి, అడవికొలను, భువనపల్లి, పెదనిండ్రకొలను గ్రామాలలో పవన్ కల్యాణ్ అభిమానులు, జనసేన నాయకులు, కార్యకర్తలు కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచారు. పెదనిండ్రకొలను పీహెచ్‌సీలో రోగులు పండ్లు పంపిణీ చేశారు. ముత్యాల స్వామి, నిమ్మల దొరబాబు, వాకమూడి ఇంద్రకుమార్, బలాజి, బేతు మురళీ, అల్లుమోలు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: మండలంలోని ధర్మాజీగూడెం, కలరాయునిగూడెం, బోగోలు, రంగాపురం, ఆసన్నగూడెం, కొత్తపల్లి మీదుగా లింగపాలెం వరకు జనసేన కార్యకర్తలు, కూటమి నేతలు కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంది మహేశ్‌బాబు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మాదాసు కృష్ణ, తాళం మల్లేశ్వరరావు, నిమ్మగడ్డ రామ్‌కుమార్, యాకూబ్‌వలీ, నాగబాబు, సుభానీ, పలువురు జనసేన, టీడీపీ వీరమహిళలు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో గడ్డమణుగు కాంప్లెక్స్ నందు పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఆస్పత్రిలో రోగులకు పళ్లు పంచారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శులు గడ్డమణుగు రవికుమార్ కరాటం సాయి, నాయకులు పసుపులేటి రాము, సుంకవల్లి సాయి, కోలా మధు, బి.రాజబాబు, జి.అరుణ్, బి.అనిల్, డి.సతీష్‌రెడ్డి, వి.వెంకటేశ్వరావు, జి.శివ ఉన్నారు.

● పెదవేగి: మండలంలో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో మొక్కలు నాటి, కేక్‌కట్ చేసి, వేడుకలు జరిపారు. కవ్వగుంటలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జనసేన నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విజయరాయిలో ఏర్పాటు చేసిన మహనీయుల చిత్రపటాలను ఆవిష్కరించారు. వంగూరులో జేజే కరుణోదయ స్వచ్ఛంద సంస్థలో విభిన్నప్రతిభావంతులతో కలిసి భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు.

● భీమడోలు: గ్రామాల్లో కూటమి నేతలు, జనసైనికులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భీమడోలు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు, గ్లౌజులను అందజేశారు. ఎస్ఆర్ఐ రాకేష్ సహకారంతో పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు నగదు, సీల్డును అందజేశారు. ప్రత్తి మదన్, వట్టి పవన్, కూటమి సభ్యులు, పాల్గొన్నారు. గుండుగొలనులో జెండా స్థూపాన్ని ప్రారంభించారు. సూరప్పగూడెంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ప్రారంభించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

● కొయ్యలగూడెం: కూటమి నాయలకుల ఆధ్వర్యంలో కొయ్యలగూడెంలో పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు కేక్ కట్ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. పీహెచ్‌సీలో రోగులకు బెడ్‌షీట్లు అందజేశారు. దుగ్గిన శ్రీను, నరసింహరాజు, జయబాబు, ముప్పరచినరాజు, చింతలవెంకటరమణ, రమా, పసుకుర్తి ఉమా, మలిశెట్టి కేసిబాబు, నారా కేశవ, కోనా కుమార్, తదితరులు పాల్గొన్నారు. దిప్పకాయలపాడులో కరాటం రాంబాబు కేకుకట్ చేశారు.

● జంగారెడ్డిగూడెం: పట్టణంలో జనసేన నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వైద్యశిబిరాలను చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ప్రారంభించారు. పలువురు అభిమానులు రక్తదానం చేశారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఐదుగురు దివ్యాంగులకు ఐదు వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. కరాటం రాంబాబు, మేకా ఈశ్వరయ్య, పరిమి సత్తిపండు, రావూరి కృష్ణ, వలవల తాతాజీ, ఉక్కుర్తి సీతారాం, చింతలనాని, గుమ్మడి ప్రసాద్, కొప్పాక శ్రీనివాసరావు, పగడం సౌభాగ్యవతి, తెలగారపు జ్యోతి, కరుటూరి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

● దెందులూరు: జనసేన పార్టీ నాయకులు కొఠారు ఆదిశేషు, మహిళ నాయకురాలు లక్ష్మి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 63 మంది రక్త దానం చేశారు. కలపాల చంద్రశేఖర్, పలువురు నేతలు పాల్గొన్నారు. పోతునూరు శివారు ఉండ్రాజవరంలో ఘంటశాల వెంకటలక్ష్మి, బుజ్జి రక్తదాన శిబిరం ప్రారంభించారు. గాలాయగూడెం, గోపన్నపాలెం, పలు గ్రామాల్లో పవన్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నారా శేషు, వెంకటలక్ష్మి, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

● కామవరపుకోట: కూటమి నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి కేక్ కట్ చేశారు. ఘంటా మురళీరామకృష్ణ, మేకా ఈశ్వరయ్య, కిలారు సత్యనారాయణ, ఘంటా సత్యంబాబు, వజీర్‌ఖాన్, షేక్ వలీ, బొబ్బిలి వీరబాబు, వెంకన్నబాబు, పసుమర్తి పార్థసారధిబాబు, వేముల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● పోలవరం: మండలంలో సోమవారం కూటమి నాయకులు పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పోలవరం ఆస్పత్రిలో రోగులకు పాలు పండ్లు పంపిణీ చేశారు. మహాత్మాగాంధీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఏటిగట్టు సెంటర్‌లో కేక్ కట్ చేశారు. కరిబండి నాగరాజు, బొరగం వెంకటలక్ష్మి, నల్లా రాంబాబు, కామిశెట్టి నాగరాజు, కొణతాల ప్రసాద్, తెలగంశెట్టి రాము, అనిశెట్టి రాధయ్య పసుపులేటి అనిల్ కుమార్, అవినాష్, మాట్ల మణికంఠ, అమరాన్ పోశి, వారాడి సత్తిబాబు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: జనసేన నేతలు శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ద్వారకాతిరుమల సచివాలయం వద్ద కూటమి నేతలు కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచారు. మండలంలో పలుచోట్ల జనసైనికులు పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు.

● చింతలపూడి: పట్టణంలోని శారద థియేటర్ వద్ద మెగాఫ్యాన్స్ నేత టీఎస్‌వీ కుమార్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి అభిమానులు పంపిణీ చేశారు. పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. చీదరాల మధుబాబు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి, కొత్తపూడి శేషగిరిరావు, పక్కాల వెంకటేశ్వరరావు, తోట వెంకట నారాయణ, శ్రీనివాస్, బోడా అనీష్‌కుమార్, పలువురు పాల్గొన్నారు.

● కుక్కునూరు: స్థానిక రామాలయంలో పూజలు నిర్వహించి అనంతరం కుక్కునూరులో ద్విచక్రవాహనాలపై భారీ ర్యాలీ నిర్వహించారు. తెల్లరాయిగూడెం పునరావాస కాలనీలో 101 మొక్కలు నాటారు. ములిశెట్టి నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణ, పిచ్చుక రాజు, ముప్పాల శివయ్య, చుంచు సత్యనారాయణ, ఎం.యుగంధర్, మంత్రి గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 6 వరకు ఆందోళన చేపట్టనున్నట్లు సీపీఐ నాయకులు మన్నవ కృష్ణ, డేగా ప్రభాకర్‌లు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని, అర్హులందరికీ పెన్షన్లు అందచేయాలని కోరారు.
- **ద్వారకాతిరుమల :** : జి.కొత్తపల్లికి చెందిన రేవూరి సుబ్బారావు ఇటీవల మృతి చెందగా అతని కుటుంబానికి ఎంపీటీసీ సభ్యుడు బి.బజారయ్య రెండు బియ్యం బస్తాలు, నూనె డబ్బా, ఉల్లిపాయ బస్తా, కొంత నగదు అందజేశారు. బజారయ్యను గ్రామస్థులు అభినందించారు.
- **చింతలపూడి :** అధిక ధరలను అదుపుచేయాలని సీపీఐ మండలశాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కంచర్ల గురవయ్య మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, అర్హులైన వారికి రేషన్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.
- **ద్వారకాతిరుమల :** నిత్యావసర ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పెదరావిగూడెం, తొండిపాక, శ్రీధరవేలేరు పంచాయతీల్లోని సచివాలయాల ముందు ఆందోళన చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.రమణయ్య, పీ.బిక్షం, ఆదమ్మ తదితరులు పాల్గొన్నారు.
- **కామవరపుకోట :** మండలంలోని 16 సచివాలయాల పరిధిలో 8,132 మందికి పెన్షన్లు అందచేయాల్సి ఉండగా శనివారం, సోమవారం రెండు రోజుల్లో 8,024 మందికి పెన్షన్లు పంపిణీ చేశారు. మండలంలో 98.67 శాతం ప్రగతి సాధించినట్టు ఎంపీడీవో కె.శ్రీదేవి తెలిపారు. కొండగూడెంలో ఘంటా సుధీర్‌బాబు, కోనేరు వెంకట సుబ్బారావు, పండు జగదీష్ కోనేరు వెంకట్రామయ్య, నెక్కలపు సూర్యనారాయణ పాల్గొన్నారు.



నూజివీడు పెద్దచెరువుకు గండిపడిన దృశ్యం (ఫైల్)



ఖాళీ అయిన పెద్దచెరువు!

అంతా 2 గంటల్లోనే...

గతంలో ఎన్నో వర్షాలు కురిశాయి. అయినా చెరువులోకి సగం వరకు కూడా నీరు చేరలేదు. భారీ వర్షాలు అన్నారు. మహా అయితే మరో మూడు రోజుల్లో నూజివీడు పెద్దచెరువు నిండుతుంది. కళింగ పారి లింకు చెరువులకు నీరు వెళుతుంది.. అందరూ అనుకున్న మాట ఇది. అయితే శనివారం ఉదయం 10 గంటల నుంచి ఎడతెరిపిలేని వాన. ఎక్కడి నుంచి వచ్చిందో వరద ఒక్క ఉదుటున పెద్దచెరువు వైపు పరుగులెత్తింది.

- అప్పటివరకు సగం ఖాళీగా ఉన్న పెద్దచెరువు
- 2 గంటల్లో నిండా నీరు, వెనువెంటనే తెగిన గట్లు
- రాత్రిపూట గండిపడితే పెను ముప్పే జరిగేది..
- అమ్మవారే కాపాడిందంటున్న స్థానికులు?

నూజివీడు టౌన్, సెప్టెంబరు 2: శనివారం నాడు మధ్యాహ్నం 1.30- 2 గంటల మధ్య ప్రాంతంలో పెద్దచెరువు గట్లను తాకుతూ నీరు చేరింది. నిత్యం నూజివీడు నుంచి చెరువు లోపలికి మేతకు, నీటికి పశువులు తిరిగే ప్రదేశంలో కొద్దికొద్దిగా నీరు బయటకు రావడం ప్రారంభించింది. నీరు మరింత పెరుగుతూ చెరువు కట్టకు గండిపడింది. ఓ వైపు నివాసగృహం, మరో వైపు దుర్గమ్మవారి కోవెల. ఈ రెండింటి మధ్య నుంచి ఒక్కసారిగా వెలమపేటలోకి నీరు ప్రవేశించింది. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో వస్తున్న నీరు కుండపోతగా కురుస్తున్న వర్షానికి వస్తోందా? లేక మరేదైనా అనేది అర్థం కాని పరిస్థితి. చివరికి సమీపంలో ఉన్న మూడు అంతస్తుల భవనం ఎక్కి చూసిన వారికి పెద్దచెరువుగట్టు తెగి నీరు బయటకు వస్తున్న విషయం అర్థమైంది. దీంతో వెలమపేట యువత చేయి చేయి కలిపారు.. ముంపు ప్రాంతం వైపు కదిలారు. సమీపంలో అందుబాటులో ఉన్న తాళ్లను తీసుకువచ్చి నీట మునిగిన ఇళ్ల నుంచి ప్రజలను ఒక్కొక్కరిగా బయటకు తీసుకువచ్చారు. దాదాపు 50 కటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈలోపే నూజివీడు పెద్దచెరువుకు నీటిని చేరవేసే బిలుడు వాగు మరింత నీటిని తీసుకువచ్చింది. గతంలో గండిపడిన ప్రాంతంలోనే కట్ట బలహీనంగా ఉండటంతో అక్కడ గండిపడటం, వచ్చేనీరు ఉధృతితో ఆ ప్రక్కనే మరో గండిపడటం వెనువెంటనే జరిగింది. ఫలితంగా నూజివీడు లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆఫీస్ ఎదురుగా భారీ గండిపడి వరద నీరు నూజివీడు బైపాస్ వైపు వెళ్ళింది. దీంతో నూజివీడు ప్రధాన పట్టణంవైపు పొంచి ఉన్న ప్రమాదం తప్పింది.

రాత్రి జరిగి ఉంటే ప్రాణాలు దక్కేవి కావు....

దాదాపు 250 ఎకరాలు విస్తీర్ణం ఉన్న నూజివీడు పెద్దచెరువుకు రాత్రిపూట గండిపడి ఉంటే పట్టణంలోని వెలమపేట, గాంధీనగర్ తదితర ప్రాంతాలు జలమయమై భారీ దుర్ఘటన చోటుచేసుకుని ఉండేది. మధ్యాహ్నం ప్రాంతంలో గండిపడటంతో అందరూ అప్రమత్తమై బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఆ అమ్మవారే రక్షించిందా....

తొలుత నూజివీడు పెద్దచెరువుకు గండిపడిన ప్రాంతంలో ఓవైపు కనకదుర్గ అమ్మవారి ఆలయం. మరోవైపు నివాసగృహం ఉంది. దీంతో ఆ నీటి ఉధృతిని నివాసగృహం, అమ్మవారి ఆలయాలు కొంతమేరకు నిలుపుదల చేశాయి. ఫలితంగా గండి విస్తృతి పెరగలేదు. అదే మొదటి గండిపడిన ప్రాంతంలో విస్తృతి పెరిగి ఉంటే పెద్దచెరువు నీరు మొత్తం నూజివీడు పట్టణంలోకే ప్రవహించి కోట్లాది రూపాయల ఆస్తినష్టంతో పాటు ప్రాణనష్టం కూడా సంభవించేది. ఓ వైపు గోమాటి హైమావతికి చెందిన నివాస గృహం, మరోవైపు అమ్మవారి ఆలయం గండి విస్తృతిని పెంచకుండా ఆపడంతోనే పెనుప్రమాదం తప్పిందని స్థానిక పెద్దలు పేర్కొంటున్నారు. అయితే గోమాటి హైమావతి గృహం పూర్తిగా ధ్వంసమవ్వగా వారు నిరాశ్రయులుగా మారడం బాధాకరం.

సహాయక శిబిరాలు ఖాళీ...

నూజివీడు పట్టణంలో పెద్దచెరువు ముంపు బాధితుల సహాయార్థం నూజివీడు పట్టణంలో బాలికోన్నత పాఠశాల, ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల, గాంధీనగర్, పాఠశాలల్లో సహాయక శిబిరాలను ఏర్పాటు చేశారు. అయితే ఆదివారం మధ్యాహ్నం నుంచి వాతావరణం తెరిపి ఇవ్వడంతో ఒక్కొక్కరుగా వరద బాధితులు ఇళ్ళబాట పట్టారు.

భారీగా నష్టం...

పెద్దచెరువుకు గండిపడిన ఘటనలో పట్టణంలోని 32వ వార్డులో దాదాపు 100 ఇళ్లల్లోకి నీరు చేరి 50 కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. వంద ఎకరాలకు పైగా పంట నష్టపోవడంతో పాటు సంబంధిత వ్యవసాయ భూములు సాగుకు పనికిరాని విధంగా నష్టం వాటిల్లింది. మరోవైపు లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆఫీస్ వద్ద లారీలు, మెకానిక్ షాపుల వద్ద కార్లు నిలిపి ఉంచడంతో వాటి ఇంజన్‌లలోకి నీరుచేరి లారీలు, కార్లు మరమ్మతులకు గురయ్యాయి.



పెద్దచెరువు గండితో కూలిపోయిన ఇల్లు (ఫైల్)



రాత్రిపూట జరిగితే పెను ముప్పే..

దాదాపు 40 ఏళ్లలో ఇలాంటి సంఘటన చూడలేదు. ఎంత భారీవర్షం వచ్చినా పెద్దచెరువు నిండా నీరు చేరి, కళింగ నుంచి బయటకు వెళ్ళేది. అయితే దాదాపు 10 సంవత్సరాలుగా పెద్దచెరువు కట్టలకు నిర్వహణ లేకపోవడంతో చెరువుకట్టలు బలహీనమయ్యాయి. కేవలం రెండు గంటల్లో వచ్చిన వరదతో చెరువుకట్టలు ధ్వంసమై భారీ విపత్తు చోటుచేసుకుంది. అదే రాత్రిపూట జరిగి ఉంటే పెనుప్రమాదం జరిగేది.

- వాకా నాగరాజు, నూజివీడు

చిన్న కళింగను పూడ్చాలి

నూజివీడు పెద్దచెరువుకు గండిపడటం ఇది మూడోసారి. 1968లో ఒకసారి పెద్దచెరువుకు గండిపడినట్టు పెద్దలు తెలిపారు. 20 సంవత్సరాల క్రితం మరోసారి గండిపడింది. మాజీ వైస్ చైర్మన్ దుబ్బిరెడ్డి సత్యనారాయణ పాత ఇంటివద్ద చిన్న కళింగ ఉంది. దాన్నివల్ల పట్టణానికి ప్రమాదం పొంచి ఉంది. కళింగని పూడ్చి పెద్దచెరువుగట్టు ఎత్తు పెంచటం ద్వారా నూజివీడు పట్టణానికి ఎటువంటి ప్రమాదం లేకుండా చూడవచ్చు.

-కందిపల్లి చెన్నారావు, నూజివీడు



ట్రిపుల్ ఐటీ ఫుడ్ కాంట్రాక్టర్లపై కేసు నమోదు

నూజివీడు, సెప్టెంబరు 2: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో వందలాది మంది విద్యార్థుల అస్వస్థతకు కారణమైన ఇద్దరు ట్రిపుల్ ఐటీ ఫుడ్ కాంట్రాక్టర్ల పై సోమవారం కేసు నమోదైంది. గత ఐదు రోజులుగా ట్రిపుల్ ఐటీలోని రెండు మెస్సుల్లో నాసిరకం ఆహారం విద్యార్థులకు అందించటం, మెస్‌ల పరిస్థితిపై వరుస కథనాలు రావడంతో స్పందించిన రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారాలోకేశ్ విచారణ కమిటీని నియమించారు. కమిటీ నివేదిక ఇవ్వడంతో ఆయన ఫుడ్ కాంట్రాక్టర్ల పై కేసు నమోదు చేయాలని నూజివీడు ట్రిపుల్ ఐటీ అధికారులను ఆదేశించడంతో నాసిరకం ఆహార పదార్థాలను అందించిన ఫైన్ క్యాటరర్స్ అండ్ సప్లయిర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ ఘోష్, అనూష హాస్పిటాలిటీ సర్వీసెస్ ఎండీ పి.వెంకట నారాయణపైన ట్రిపుల్ ఐటీ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు, నారా లోకేశ్‌కు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా లోకేశ్ ట్రిపుల్ ఐటీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. తొలుత డైరెక్టర్‌ను తొలగించి ఆయన స్థానంలో త్రీమెన్ కమిటీని వేయటమే కాక ఫుడ్ కాంట్రాక్టర్లపై పోలీస్ కేసు కూడా నమోదు చేయించారు. ఈ ఇద్దరు కాంట్రాక్టర్లు పేరుకే రెండు సంస్థలుగా కాంట్రాక్ట్‌లు పొందినా నూజివీడు ట్రిపుల్ ఐటీలో మాత్రం ఒకే యాజమాన్యం కింద వీరు మెస్‌ను నడుపుతున్నారని విచారణలో తేలింది. ఈ ఇద్దరు కాంట్రాక్టర్లను రాష్ట్రవ్యాప్తంగా ఏ ఇతర టెండర్‌లలో కూడా పాల్గొనకుండా బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. కొత్త కాంట్రాక్టర్లను నియమించే వరకు విద్యార్థులకు ఆహారం అందించటానికి తాత్కాలికంగా ఈ ట్రిపుల్ ఐటీలోనే మూడో మెస్ నడుపుతున్న కేఎంకే కేటరింగ్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కొత్త టెండర్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. ఆరోపణలు ఉన్న క్యాంపస్‌లోని ఫుడ్ కోర్ట్‌ను సైతం తక్షణమే మూసివేయాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ఫుడ్ కోర్టుకు సంబంధించిన కొత్త టెండర్ ప్రక్రియను వారంలో ప్రారంభించాలని మంత్రి లోకేశ్ ట్రిపుల్‌ఐటీ అధికారులకు స్పష్టం చేశారు. మెస్ భోజన అంశంలో ఆరోపణల అనంతరం పరిస్థితిని చక్కదిద్దేందుకు నూజివీడు వచ్చిన ఫైన్ కేటరర్స్ నిర్వాహకుడు ఘోష్ కేసు నమోదు అనంతరం అజ్ఞాతంలోకి వెళ్ళినట్లు సమాచారం.

కమిటీ సిఫార్సులు...

ఆహార నాణ్యత పర్యవేక్షణకు స్టూడెంట్ మెస్ కమిటీని నియమించి, స్టాల్స్ భోజన ప్రాంతం, వంటగది ప్రాంతాలను విద్యార్థులతో కూడిన మరో మెస్ కమిటీని నియమించి పర్యవేక్షించాలి. ప్రతి డైనింగ్ హాల్లోనూ ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలి. ఆహార తనిఖీ కోసం ఇద్దరు ఫుడ్ సేఫ్టీ తనిఖీ అధికారులను నియమించాలని సిఫార్సు చేసినట్లు సమాచారం. పరిస్థితులు చక్కబడే వరకు నూజివీడు ఆర్డీవో నిరంతరం పర్యవేక్షించాలని సూచించింది.

వేద పాఠశాల విద్యార్థుల శ్రమదానం

ఆగిరిపల్లి, సెప్టెంబరు 2: ఆగిరిపల్లి శ్రీ లక్ష్మీనరసింహా వేద పాఠశాల విద్యార్థులు వరాహ పుష్కరిణిలోని పిచ్చిమొక్కలు తొలగించారు. 60 మంది విద్యార్థులు గల వేద పాఠశాల విద్యార్థులు వరాహ పుష్కరిణి మెట్లమీద గల పిచ్చిమొక్కలు తొలగించి పుష్కరిణిని సుందరీకరించారు. నిన్నమొన్నటిదాకా చుక్కనీరులేక వెలవెలపోయిన ఆగిరిపల్లి వరాహ పుష్కరిణి (మెట్ల కోనేరు)ఎగువ కురిసిన వర్షాలకు ఆగిరిపల్లిలో గల కుంపెనీ వాగుకు వచ్చిన వరద వల్ల పూర్తిగా నిండి జలకళ సంతరించుకుంది. మెట్లకోనేరు నీటితో నిండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముంపు గ్రామాల్ని పరిశీలించిన ఎమ్మెల్సీ

మండవల్లి సెప్టెంబరు 2 : భారీ వర్షాల కారణంగా కొల్లేరు గ్రామాలు ముంపుకు గురికావడంతో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సోమవారం మండవల్లి మండలంలోని ముణుగులూరు గ్రామంలోని పెద్దఎడ్లగాడి వంతెన వద్ద ఎగువ నుండి వస్తున్న నీటి ఉధృతిని పరిశీలించారు. అనంతరం పెనుమాకలంక గ్రామానికి వెళ్లే రహదారి ముంపుకు గురై రాకపోకలు స్తంభించడతో మండవల్లి తహసీల్దార్‌కు ఫోన్ చేసి గ్రామస్థుల రాకపోకలకు బోట్లు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఎగువ ప్రాంతం నుంచి కొల్లేరుకు భారీ వరద నీరు వస్తున్న తరుణంలో లంక గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని జయమంగళ సూచించారు.

నూజివీడులో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ పరిశీలన

నూజివీడు టౌన్, సెప్టెంబరు 2: నూజివీడు పెద్దచెరువుకు గండిపడిన నేపథ్యంలో నూజివీడు పట్టణంలో 32వ వార్డులో గల ముంపు ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు పర్యటించారు. అండగా ఉంటామని బాధితులకు ధైర్యం చెప్పారు. వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



రమణక్కపేటలో వరదనీటిలో చిక్కుకున్న గృహాలు



గండిపడిన చిన్నంపేట తమ్మిలేరు కాజ్‌వే పరిశీలిస్తున్న తహసీల్దార్

ఉధృతంగా తమ్మిలేరు

- కుమ్మరివారి బజారులో జల దిగ్బంధంలో నివాస గృహాలు
- వరదనీరు తొలగింపుకు చర్యలు చేపట్టని అధికారులు?
- హెల్త్‌క్లినిక్ సెంటర్‌ను చుట్టుముట్టిన వరదనీరు

ముసునూరు, సెప్టెంబరు 2: మండల వ్యాప్తంగా ఉన్న తమ్మిలేరులో వరదనీరు ఉధృతంగా ప్రహిస్తోంది. తమ్మిలేరు పరీవాహక గ్రామాలైన లోపూడి, గుడిపాడు, గుళ్లపూడి, వలసపల్లి, బలివే, యల్లాపురం, వేల్పుచర్ల గ్రామాలకు ప్రమాదం పొంచి ఉంది. పరివాహక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. చేపల వేట, ఈతకు తమ్మిలేరులోకి వెళ్ళవద్దని, మరో రెండురోజులపాటు వరద ఉధృతి కొనసాగే అవకాశం ఉందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎమిలికుమారి పేర్కొన్నారు.

వరద నివారణ చర్యలు లేవు : స్థానికులు

రమణక్కపేట కుమ్మరివారి బజారులో నివాస గృహాలు జల దిగ్బంధంలోనే ఉన్నాయి. వరదనీరు తొలగింపునకు అధికారులు సోమవారం కూడా చర్యలు చేపట్టకపోవడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల చుట్టూ మూడడుగులు ఎత్తులో నీరు ఉండ టంతో ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. వైసీపీ నాయకుడు డ్రైనేజీ ఆక్రమించుకుని, వర్షపునీరు వెళ్లనీయకుండా మట్టిని కట్టగా పోయడం వల్ల కుమ్మరి బజారు ముంపునకు గురవుతుందని, ఈ సమస్యపై సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోక పోవడంతో ఇటీవల మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకువెళ్ళామని బాధితులు తెలిపారు. సమస్య పరిష్కరించాలని పంచాయతీ అధికారులను మంత్రి ఆదేశించినా ఆ ఆదేశాలు బేఖాతరయ్యాయని బాధితులు ఆరోపించారు. రెండు రోజుల నుంచి ఇళ్ళచుట్టూ వరదనీరు ఉన్నప్పటికి ఒక్క అధికారి కూడా పట్టించుకోలేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జల దిగ్బంధంలో హెల్త్ క్లినిక్

చెక్కపల్లి హెల్త్ క్లినిక్ భవనం సోమవారం కూడా జల దిగ్బంధంలోనే ఉంది. బసవరపుపాడు వాగు ఉధృతికి హెల్త్‌క్లినిక్‌తో పాటు అంబేద్కర్ నగర్‌ను వరదనీరు చుట్టుముట్టింది. సుమారు 30 కుటుంబాల వారికి జడ్పీ పాఠశాలలో పునరావాసం కల్పించి, టీడీపీ నాయ కులు, అధికారులు సహాయక చర్యలు అందిస్తున్నారు. హెల్త్‌క్లినిక్ చుట్టువరద నీరు తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో సిబ్బంది విధు లకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. చెక్కపల్లి వద్ద ఆర్‌అండ్‌బీ రహదారికి ఏర్పడిన గండిని పూడ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో చెక్కపల్లి-ముసు నూరు గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వలసపల్లి ప్రధాన రహదారిలో సంధ్యవాగు, నూజివీడు ప్రధాన రహదారిలో సింహాద్రి పురం వద్ద రాములేరు వాగుల్లో వరద ఉధృతి తగ్గడంతో రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి.

గండి పడిన చిన్నంపేట తమ్మిలేరు కాజ్‌వే పరిశీలన

చాట్రాయి: గండి పడిన చిన్నంపేట తమ్మిలేరు కాజ్‌వే అప్రోచ్ రోడ్డును సోమవారం తహసీల్దార్ ప్రశాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ చాట్రాయి మండల రైతులు ఏటి అవతల, అక్కడ రైతులకు ఇక్కడ వ్యవసాయ భూములు ఉన్నాయని, శివపురానికిచెందిన సుమారు 200 మంది విద్యార్థులు చిన్నంపేట స్కూల్‌లో చదువుతున్నారని రాకపోకలు ఆగిపోవటం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరించాలరి తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళతానని హామీ ఇచ్చారు.

కొల్లేటి గ్రామాలకు పొంచి ఉన్న ముంపు ముప్పు

మండవల్లి సెప్టెంబరు 2 : కొల్లేరు వరద ఉధృతి పెరుగుతున్న దృష్ట్యా కొల్లేటి లంక గ్రామాలకు ముంపు ముప్పు పొంచి ఉందని ఇప్పటికే రహదారులు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అధికారులు చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని కొల్లేరు సంరక్షణ సంఘం అధ్యక్షుడు బలే ఏసురాజు కోరారు. సోమవారం పెనుమాకలంక పెద్దఎడ్లగాడి ఆర్‌అండ్‌బీ రహదారి ముంపును ఆయన పరిశీలించారు. అధికారులు తక్షణమే ముంపునకు గురయ్యే గ్రామాలను గుర్తించి సహాయ చర్యలు చేపట్టాలని కోరారు. కొల్లేరు ప్రవహానికి అవరోధంగా పెద్దఎడ్లగాడి వద్ద దట్టంగా విస్తరించిన తూడు, గుర్రపుడెక్కలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

కైకలూరు మండలంలో పొలాల పరిశీలన

కైకలూరు, సెప్టెంబరు 2: మండలంలోని వేమవరప్పాడు, తామరకొల్లు గ్రామాల్లో వరి పొలాలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. సోమవారం ఆయా గ్రామాల్లో ముంపునకు గురైన పంట పొలాలను ఏడీఏ ఆర్. గంగాదరరావు, మండల వ్యవసాయాధికారిణి ఆర్. దివ్య పరిశీలించి నీటిని బయటకు తరలించి పంటలను కాపాడాలన్నారు. పొలాలకు నీరు వెళ్లే డ్రెయిన్లను పరిశీలించారు.

రహదారిని బాగు చేసిన జనసేన నాయకులు

ముదినేపల్లి, సెప్టెంబరు 2 : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ముదినేపల్లి మండలంలో జనసేన పార్టీ నాయకులు ప్రధాన రహదారులలో పలు చోట్ల గోతులను పూడ్చే పనులను నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సింగరాయపాలెం - బంటుమిల్లి ప్రధాన రహదారిలో కొత్తపల్లి గ్రామం వద్ద వర్షాలకు ధ్వంసమై ప్రమాదకరంగా ఉన్న గోతులను ఎక్స్‌కవేటర్‌తో పూడ్చించి చదును చేయించారు.

ముదినేపల్లి మండలంలో..
7 వేల ఎకరాల్లో ముంపు

అస్తవ్యస్త డ్రెయిన్లే కారణమన్న గ్రామస్థులు

ముదినేపల్లి, సెప్టెంబరు 2 : ముదినేపల్లి మండలంలో సుమారు 17,500 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేయగా, వర్షాలకు సుమారు 7 వేల ఎకరాల్లోని వరి పైరు పూర్తిగా మునిగిపోయింది. మరో మూడు వేల ఎకరాల్లో వరి పైరు కొసలు మాత్రమే కనిపిస్తున్నాయి. లేత దశలో ఉన్న వరి పైరు నీటమునిగి కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వేలాది ఎకరాల ఆయకట్టులో ముంపు ఇప్పట్లో తగ్గే అవకాశం కనిపించటం లేదు. పొలాల ముంపునకు అస్తవ్యస్త డ్రెయినేజీ వ్యవస్థే కారణమని తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు అన్నారు. వైసీపీ ప్రభుత్వం డ్రైనేజీ వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, వర్షం కురిస్తే డ్రెన్లలో నీరు కదలలేని పరిస్థితి నెలకొందన్నారు. పెదకొమ్మిలేరు డ్రెన్ ఆక్రమణలు తొలగిస్తేనే పలు గ్రామాల ఆయకట్టుకు ముంపు బెడద తప్పుతుందన్నారు. వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. పెదలంక మేజర్ డ్రైన్‌లో కిక్కిస తొలగించాలని ఉప్పరగూడేనికి చెందిన నచ్చిరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. పొలాల్లో ముంపు త్వరగా తగ్గాలంటే డ్రెన్లను బాగు చేయటం ఒక్కటే మార్గమన్నారు.

ముంపు పొలాలు పరిశీలించిన అధికారులు

వర్షాలకు ముదినేపల్లి మండలం ఊటుకూరు, ఉప్పరగూడెం, కోమర్రు, వణుదుర్రు గ్రామాల్లో ముంపునకు గురైన సార్వా వరి పొలాలను సోమవారం తహసీల్దార్ సుబానీ, ఏడిఏ వెంకట మణి, వ్యవసాయాధికారి వేణుమాధవ్ పరిశీలించారు. ముంపు వల్ల కలిగిన నష్టాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, రైతులు అధైర్యపడవద్దని అధికారులు తెలిపారు. డ్రైన్లలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, కిక్కిస తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరగా, డ్రైనేజీ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ తెలిపారు.

5 వేల పులిహోర పొట్లాలు



ఆగిరిపల్లి, సెప్టెంబరు 2: విజయవాడ వరద బాధితులకు కలెక్టర్ ఆదేశానుసారం ఆగిరిపల్లి దాతల సహకారంతో ఎమ్మార్వో పిఎస్‌వి ప్రసాద్ పర్యవేక్షణలో సుమారు 5 వేల పులిహోర ప్యాకెట్లు సిద్ధం చేసి విజయవాడ పంపించారు. దాత పొన్నం లక్ష్మణరావు ఆర్థిక సాయం చేసినట్టు వీఆర్వో వంశీ తెలిపారు.

బియ్యం వితరణ



దాతలను సన్మానిస్తున్న ఆర్డీవో

నూజివీడు టౌన్, సెప్టెంబరు 2: వరద బాధితుల సహాయార్థం నూజివీడుకు చెందిన సుంకర కోదండరామ్ ప్రసాద్ దంపతులు 100 కిలోల బియ్యాన్ని నియోజకవర్గ టీడీపీ నాయకుడు నూతక్కి వేణు గోపాల రావు ఆధ్వర్యంలో ఆర్డీవోకి అందచేశారు. నూజివీడు ఏరియా ఆసుపత్రి రోగులకు సహాయార్థం సుమారు రూ. 2 లక్షలతో వాటర్ ప్లాంట్ ఇవ్వడానికి దాతలు కోదండరామ్ దంపతులు ముందుకు వచ్చారు. గతంలో వీరు మున్సిపల్ స్ట్రీట్‌లైట్లకు, రాజధాని నిర్మాణానికి సహకారం అందించినట్టు వేణుగోపాలరావు ఆర్డీవో భవానీ శంకరి దృష్టికి తేవడంతో దాతలను ఆమె సత్కరించారు. కిషోర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు జనసేన వితరణ



నూజివీడు టౌన్, సెప్టెంబరు 2: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జనసేన ఆధ్వర్యంలో నిత్యావసరాలను పంపిణీ చేశారు. భారీ వర్షాలకు నూజివీడు పట్టణంలో పెద్దచెరువుకు గండిపడి వరద ప్రభావంతో దాదాపు 100 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా నూజివీడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణిబాబు ఆధ్వర్యంలో కూరగాయలు, నిత్యావసరాలను పంపిణీ చేశారు. జనసేన నాయకులు తోట వెంకట్రావు, బొబ్బిలి శ్రీకాంత్, పాశం నాగబాబు, సూరిశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌కు ఘన నివాళి



నూజివీడు టౌన్, సెప్టెంబరు 2: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక ద్వారకా ఎస్టేట్‌లో ఆయన చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నూజివీడు ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్‌ను పంపిణీ చేశారు.

చాట్రాయి: చాట్రాయిలో రాష్ట్ర సహకార యూనియన్ మాజీ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, చెలికాని బాబ్జీ, జల్లేపల్లి పరమేశ్వరరావు తదితరులు వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రేపు చాట్రాయి మండల అత్యవసర సమావేశం

చాట్రాయి, సెప్టెంబరు 2: చాట్రాయి మండల పరిషత్ అత్యవసర సమావేశం 4వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో దుర్గాప్రసాద్ తెలిపారు. ఆగస్టు 23న అన్ని గ్రామ పంచాయతీలలో జరిగిన ఉపాధి హామీ పథకం ప్రత్యేక గ్రామ సభల్లో తీర్మానించిన పనులను సమావేశంలో చర్చించి ఆమోదిస్తామని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

చీపురుగూడెంలో వైద్య శిబిరం

చాట్రాయి, సెప్టెంబరు 2: చీపురుగూడెంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, జ్యోతి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. భారీ వర్షాల కారణంగా జ్వరాలు, డయేరియా ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

దీర్ఘకాలిక డ్రైనేజీ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ముసునూరు, సెప్టెంబరు 2: ముసునూరు పంచాయితీలో దీర్ఘకాలంగా ఉన్న డ్రైనేజీల సమస్య పరిష్కారమే లక్ష్యమని సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల దీర్ఘకాలంగా ఉన్న డ్రైనేజీ సమస్యలను ప్రణాళిబద్ధంగా పరిష్కరించే దిశగా సర్పంచ్ చర్యలు చేపట్టారు. ఓసీ ఏరియాలో పాత పంచాయతీ కార్యాలయం ప్రక్కన ఉన్న సీసీరోడుకు, ఆర్‌అండ్‌బి రోడ్డుకు మధ్యలో ఉన్న డ్రైనేజీపై లక్ష రూపాయలతో స్లాబ్‌వేసే పనులను పూర్తిచేశారు. ప్రస్తుతం పంచాయితీలో నిధులు లేకపోయిన సొంత నగదును వెచ్చించి, డ్రైనేజీపై స్లాబ్‌వేసి ప్రజల ఇబ్బందులను సర్పంచ్ తీర్చారు. సర్పంచ్ పనితీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఛలో కలెక్టరేట్‌కు పాఠశాలల స్వీపర్లు

ముదినేపల్లి, సెప్టెంబరు 2 : తమకు ఆరు నెలలుగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఛలో కలెక్టరేట్ కార్యక్రమానికి ముదినేపల్లి మండలం నుంచి జిల్లా పరిషత్ హైస్కూళ్లు, మండల పరిషత్ పాఠశాలల స్వీపర్లు, నైట్ వాచ్‌మెన్లు తరలివెళ్లారు. ఏలూరులో జరిగిన ర్యాలీలో పాల్గొని ఈ ఏడాది మార్చి నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలను ,చెల్లించాలని డిమాండ్ చేశారు.



కైకలూరులో కేక్ కట్ చేస్తున్న కూటమి నాయకులు

ఘనంగా పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు

కైకలూరు, సెప్టెంబరు 2: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను జనసేన, టీడీపీ, బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కైకలూరు మాగంటి థియేటర్లో గబ్బర్‌సింగ్ సినిమాను రీ రిలీజ్ చేసి అభిమానులు వీక్షించారు. అనంతరం థియేటర్ వద్ద, భుజబలపట్నం, కైకలూరు ట్రావెలర్స్ బంగ్లా, శ్రీశ్యామలాంబ అమ్మవారి కళామండపం వద్ద జరిగిన పుట్టినరోజు వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు పాల్గొని కేక్ కట్ చేశారు. కూటమి నాయకులు కొల్లి వరప్రసాద్, కేవీఎస్‌ఎం నాయుడు, బెల్లపుకొండ వెంకన్నబాబు, పెన్మెత్స త్రినాథరాజు, పూల రామచంద్రరావు, వడుపు నాగరాజు, కేకే బాబు, ముదునూరి లింగరాజు, తలారి రాజేష్, వీరాబత్తిన సుధా తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: మండవల్లి ప్రధాన సెంటర్లో పవన్ కల్యాణ్ అభిమానులు ఎన్డీయే నాయకులు పవన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. మండల జనసేన అధ్యక్షుడు బోయిన రాజేష్, జన్మభూమి కమిటీ మాజీ అధ్యక్షుడు ముళ్లపూడి సత్తిబాబు, కైకలూరు నియోజకవర్గ జనసేన నాయకుడు కర్రే హనుమారప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి ఎన్‌డిఏ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, మండల టీడీపీ అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి పవన్ కళ్యాణ్ బర్త్ డే కేక్‌ను కట్ చేశారు. అనంతరం గురజ రోడ్డు సెంటర్‌లో కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్, పార్టీ నాయకులు బొర్రా చలమయ్య, కోడూరు శేషుబాబు, డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్, చలసాని జగన్మోహనరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, పార్టీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండిలో సోమవారం కూటమి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి నాయకులకు, కార్య కర్తలకు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, జనసేన మండల అధ్యక్షుడు బెల్లంకొండ వెంకన్న బాబు, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టు లీలా కనకదుర్గ, బీసీ సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కోరుకొ ల్లులో జనసైనికులు కేశిరెడ్డి బలరామ్, వలవల రమేష్ తదితరులు వేడుకలు నిర్వహించి ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

చాట్రాయి: చాట్రాయిలో గ్రామ సచివాలయం వద్ద, మెయిన్ సెంటర్‌లలో సోమవారం ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కూటమి నాయకులు కేక్ కట్ చేశారు. టపాసులు కాల్చి, మిఠాయిలు పంచి అభిమానులు సంబరాలు జరిపారు. కూటమి నాయకులు బసవారెడ్డి, లక్ష్మణరావు, చంటి, కొండలు, జగన్, శర్మ, చెన్నారావు, దుర్గాప్రసాద్, శ్రీకాంత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను ముసునూరు రావిచెట్టు సెంటర్‌లో జనసైనికులు సోమవారం ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేసి, మిఠాయిలను పంపిణీ చేశారు. అనంతరం పవన్‌కల్యాణ్ చిత్రపటాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి, ఈదులగూడెం, వట్టిగుడిపాడు, పిన్నమరెడ్డిపల్లి గ్రామాల్లో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు జరిగాయి. పవన్‌కల్యాణ్‌కు నూజివీడు నియోజకవర్గ జనసేన ప్రతినిధి బర్మా ఫణిబాబు శుభాకాంక్షలు తెలిపారు. సముద్రాల కిరణ్, ముక్కు మహేష్, సంగా రంగారావు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.